KANCHARLA

# మనసులో మాట

## ఉత్తరాంధ్ర

విశాఖపట్నం | విజయనగరం | అనకాపల్లి
శ్రీకాకుళం | అల్లూరి జిల్లా (పాడేరు) | పార్వతీపురం

బుధవారం 15 జూన్ 2026 పేజీలు 16

## జనాభా పెరుగుదలకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలి





04



## పెద్ద బిడ్డ రోడ్డు మాటేమిటి 4 కోట్ల 45 లక్షలు

# ఏమైనట్లు

- పనులు ప్రారంభించి 8 ఏళ్ళు అయినా పూర్తికాని రహదారి
- అర్ధాంతరంగా ఆగిపోయిన రహదారి పనులు
- ఇది అధికారుల లోపమా గుత్తేదారుల నిర్లక్ష్యమా
- తక్షణమే పనులు ప్రారంభించాలని స్థానిక గిరిజనులు డిమాండ్

02



## జెడ్పీ ఛైర్‌పర్సన్ చిన్నశ్రీనుకు మాతృవియోగం...

# వైయస్ జగన్ సంతాపం...

**విజయనగరం, జులై 15 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, విజయనగరం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, భీమిలి వైసీపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) కు మాతృవియోగం జరిగింది. ఆయన మాతృమూర్తి మజ్జి కృష్ణవేణి(83) మంగళవారం పరమపదించారు. ఆత్మీయుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ప్రదీప్ నగర్ లోని చిన్నశ్రీను నివాసంలో ఉంచారు. బుధవారం ఉదయం 8 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**మాజీ సీఎం వైఎస్ జగన్ సంతాపం..**

చిన్నశ్రీను మాతృమూర్తి స్వర్గస్తులైన సమాచారం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణవేణమ్మ మరణ వార్త తనను ఎంతో కలచివేసిందని వైయస్ జగన్ పేర్కొన్నారు. కుటుంబానికి

..మిగతా11లో



02

## నర్సీపట్నంలో వైసీపీకి గట్టి దెబ్బ..

భారీగా టీడీపీలో చేరిన 35 కుటుంబాలు

## గిరిజన పిల్లలు విద్యాభివృద్ధే లక్ష్యం...

### మాతృభూమి సేవా సంఘం



02




## సైబర్ సెక్యూరిటీపై న్యాయ అవగాహన శిబిరం

05

# గరివిడి మండలంలో గొర్రెల పెంపకదారుల సహకార సంఘాల ఎన్నికలు ప్రశాంతం..




**చీపురుపల్లి/గరివిడి జూలై 14, (మనసులో మాట) :**

మండలంలోని వివిధ ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘాల ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. అన్ని సంఘాల్లో సభ్యులు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ ప్రతినిధులను ఎన్నుకోగా, ఎన్నికల ప్రక్రియను అధికారులు సజావుగా నిర్వహించారు.

గరివిడి మండలంలోని విజయరాంపురం, ఎం. దుగ్గివలస, కొండలక్ష్మీపురం, కోనూరు, శివరాం గ్రామాల ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. విజయరాంపురంలోని శ్రీ పైడిమాంబ గొర్రెల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షునిగా పాశి రాము ఎన్నికయ్యారు. ఎం. దుగ్గివలసలోని శ్రీ రామకృష్ణ గొర్రెల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షునిగా బొట్టా రాము ఎన్నికయ్యారు. కొండలక్ష్మీపురంలోని శ్రీ భగీరథమ్మ గొర్రెల పెంపకదారుల సహకార సంఘంకు వైగాల రాము ఎన్నిక కాగా, కోనూరులోని శ్రీ అసిరి తల్లి గొర్రెల పెంపకదారుల సహకార సంఘంకు దుఖ సత్యం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. శివరాంలోని శ్రీ సాయి కృష్ణ గొర్రెల పెంపకదారుల సహకార సంఘానికి కోండ్రు కృష్ణ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు వివిధ ప్రాంతాలకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ కె. దినేష్, డాక్టర్ గోవర్ధన్ సాగర్, డాక్టర్ హైమావతి, జూనియర్ వెటర్నరీ అధికారి టి. నారాయణరావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించినట్లు కొండపల్లి ఇన్‌చార్జి వెటర్నరీ అధికారి డాక్టర్ సేనపతి సతీష్ తెలిపారు. ఎన్నికైన అధ్యక్షులకు అధికారులు, సభ్యులు అభినందనలు తెలియజేశారు.

# నర్సీపట్నంలో వైసీపీకి గట్టి దెబ్బ..

## భారీగా టీడీపీలో చేరిన 35 కుటుంబాలు




**నర్సీపట్నం: జూలై 14 (మనసులో మాట)**

నర్సీపట్నంలో ప్రతిపక్ష వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. అధికార టీడీపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీకి చెందిన 35 కుటుంబాలు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. 28వ వార్డు అయ్యన్న కాలనీకి చెందిన మాజీ వాలంటీర్ కుంద్రపు దమయంతి ఆధ్వర్యంలో మాజీ వాలంటీర్ అడ్లబోయిన సత్యవేణితో పాటు 30 కుటుంబాల మహిళలు, అలాగే శివపురానికి చెందిన తాటికొండ ఫణికుమార్ ఆధ్వర్యంలో మరో 5 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ టౌన్ అధ్యక్షులు చింతకాయల రాజేష్ పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన మాజీ వాలంటీర్ దమయంతి మాట్లాడుతూ.. టీడీపీ సిద్ధాంతాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలోకి రావడం జరిగిందన్నారు. నర్సీపట్నంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సృష్టి క్షేత్రాన్ని వైసీపీ నాయకులు అడ్డుకోవడంపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే కేవలం అభివృద్ధిని అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఈ చేరికల కార్యక్రమంలో 28వ వార్డు మాజీ కౌన్సిలర్ డబ్బిరి శ్రీకాంత్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ, 28వ వార్డు టీడీపీ నాయకులు గాలి రమణ, బీజా రామ్ కుమార్, కొడవటి గోపి, కొవ్వాడ సంపత్, కుంద్రపు చిన్న, పసుపులేటి జ్యోతి, చెరుకూరి చంటమ్మ, పలువురు కాలనీ మహిళలు, యువత పాల్గొన్నారు.

# సాంకేతికతతో నేరాలను ఛేధించే నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి





- **అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశంలో విశాఖ రేంజ్ ఐజిపి గోపినాధ్ జట్టి**

**విజయనగరం, జులై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులతో అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశాన్ని విజయనగరం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి విశాఖపట్నం రేంజ్ ఐజిపి గోపీనాధ్ జట్టి ముఖ్య అతిధి గాను, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీమతి ఎం.బబిత, జిల్లా కలెక్టరు ఎస్.రామసుందర రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ నేరాలు జరిగే తీరు రాబోయే 5 నుండి 10 సం.ల్లో పూర్తిగా మారిపోతుందన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న నేరాల స్థానంలో సాంకేతికత ఆధారిత సైబరు, సోషల్ మీడియా నేరాలే 60శాతం ఉంటాయన్నారు. కేసులను దర్యాప్తు చేసే పోలీసు అధికారులు తమ వ్యక్తిగత, వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకొని, పని చేయాల్సిన అవశ్యకత పెరుగుతుందన్నారు. నేరస్థులు టెక్నాలజీని వినియోగించుకొని నేరాలకు పాల్పడే అవకాశాలు హెచ్చుగా ఉంటాయన్నారు. అ తరహా నేరాలను ఛేధించేందుకు దర్యాప్తు అధికారులు కూడా నూతన చట్టాల పట్ల అవగాహనతోపాటు, సాంకేతికత నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. భవిష్యత్తుకు తగిన విధంగా వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోకుంటే ప్రజల్లో నిరాశ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కావున, పోలీసు అధికారులు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ఆలోచనలు చేయాలని, వ్యక్తిగత శ్రద్ధతో వృత్తి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు.


# గిరిజన పిల్లలు విద్యాభివృద్ధే లక్ష్యం...మాతృభూమి సేవా సంఘం



**పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి జూలై 14:**

మంగళవారం నాడు సాలూరు మండలం కొత్తవలస పంచాయతీ గొందివలస ఎగువ దాగరవలస బడి పిల్లలుకు పుస్తకాలు పెన్నులు జమాట్రి సామాగ్రి పంపిణీ చేసినట్టు లు మాతృభూమి సేవా సంఘం అధ్యక్షాకార్యదర్శులు కటారి ఈశ్వర్ రావు,హరి మహేష్ తెలిపారు. వీరితోపాటు ఆదివాసీ పరిరక్షణ సమితి సభ్యులు గిరిజ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గిరిజన ప్రాంతం పిల్లలు చదువులు వారి పరిస్థితులు తెలిసి వెంటనే స్పందించిన మాతృభూమి సేవా సంఘం ద్వారా గిరిజన పిల్లలు చదువు కోసం పుస్తకాలు పెన్నులు జమాట్రి సామాగ్రి అందించడం అభినందనీయం అన్నారు అనంతరం మాతృభూమి సేవా సంఘం సాలూరు నియోజకవర్గం అధ్యక్షులు కటారి ఈశ్వర్ రావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతం పిల్లలు విద్యభివృధికి మా సంఘం సహాయం చేయడానికి సిద్దంగా ఉంది అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇందిర, బంగారాజు స్వచ్చంద సంస్థ ప్రతినిధులు అప్పారావు గ్రామస్తులు తదితరులు పాల్గున్నారు

# పెద్ద బిడ్డ రోడ్డు మాటేమిటి 4 కోట్ల 45 లక్షలు ఏమైనట్లు?



**అనంతగిరి జులై 14 మనసులో మాట**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం నిమ్మలపాడు రోడ్డు నుండి గుమ్మ గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణం కొరకు నాబార్డ్ నిధులతో 4 కోట్ల 45 లక్షలు నిధులు మంజూరు కాగా అప్పటి టిడిపి ఆయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించిన రోడ్డు పనులు సుమారు 8 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు రోడ్డు రోడ్డు నిర్మాణపు పనులు పూర్తి కాలేదని నిర్మాణపు పనులు అర్ధం పరంగా ఆగిపోవడంతో అరుకు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రేగబోయిన స్వామి అనంతగిరి మండల హ్యూమన్ రైట్స్ డిపెండర్ బిడ్డ సింహాచలం తీవ్ర విమర్శనాలు చేశారు గిరిజన మారుమూల గ్రామాలకు పట్టుకొమ్ము వంటి రహదారులు అర్ధం తరంగా ఆగిపోవడం 4 కోట్ల 45 లక్షలు మాటేమిటని ప్రశ్నిస్తున్నారు గతంలో టిడిపి ప్రభుత్వం శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు శంకుస్థాపన బోర్డులో అప్పటి ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప చింతకాయల అయ్యన్నపాత్రుడు గంట శ్రీనివాసరావు పి జి వి ఆర్ నాయుడు (గణబాబు ) లాలం భవాని భాస్కర్ పార్లమెంట్ సభ్యులు కొత్తపల్లి గీత టి సుబ్బరామిరెడ్డి విజయసాయిరెడ్డి పేర్లు బోర్డులో కనిపిస్తున్నాయి తప్ప రోడ్డు పని పూర్తి అయిన దాఖలాలు కనిపించడం లేదని విమర్శించారు ఇప్పటికైనా చెరుకు మడత జంక్షన్ నుండి కంటేపురం గ్రామం వరకు సుమారు 2 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణపు పనులు పూర్తి చేయకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు ఈ రోడ్డు పనుల కొరకు మే 27 న అనంతగిరిలో అల్లూరి జిల్లా కలెక్టర్ నిశాంతి టి వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కూటమి ప్రభుత్వ స్పందించకపోవడం సంబంధిత అధికారుల లోపమా గుత్తేదారుల నిర్లక్ష్యమా అర్ధం కాని పరిస్థితిలో ఉన్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వ పాలకులు జిల్లా అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణపు పనులు పునార ప్రారంభించాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు

# వంశధార కాలువ గండి పడడంపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం!

- యుద్ధప్రాతిపదికన పూడ్చివేత పనులు చేపట్టాలని ఆదేశం
- ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**టెక్కలి, జూలై 14 (మనసులో మాట) :**

శ్రీకాకుళం జిల్లా రైతాంగానికి ప్రధాన సాగునీటి వనరు అయిన వంశధార ప్రధాన ఎడమ కాలువకు గండి పడిన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు సాగు పనుల్లో నిమగ్నమైన తరుణంలో సారవకోట మండలం గుమ్మపాడు గ్రామం అక్కివలస పరిధిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలువకు గండి పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపబోదని తేల్చిచెప్పారు.



యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలి

కాలువకు పడిన గండిని తక్షణమే యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేసి, సాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా పునరుద్ధరించాలని సంబంధిత ఇరిగేషన్ ఇంజినీర్లను మంత్రి ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి నీటి చుక్క రైతుల పొలాలకు చేరేలా ఇరిగేషన్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలువల నిర్వహణ, బలహీన ప్రాంతాల గుర్తింపు, ముందస్తు మరమ్మతులు, నిరంతర తనిఖీలు చేపట్టడంలో అధికారులు విఫలం కావడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇకపై నిరంతర నిఘా తప్పనిసరని మంత్రి స్పష్టం చేశారు.

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..**

ప్రధాన కాలువలతో పాటు శాఖ కాలువలు, చెరువుల గట్లు, నీటి నిల్వ నిర్మాణాలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రైతుల ప్రయోజనాలే ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం, సాగునీటి నిర్వహణలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్‌ను కలిసిన సిటీ క్లబ్ నూతన కార్యవర్గం

**నర్సీపట్నం ,జూలై 14 (మనసులో మాట)**

నర్సీపట్నం: తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్‌ను నర్సీపట్నం సిటీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను చింతకాయల రాజేష్ ఆత్మీయంగా పలకరించి, ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం జరిగిన సిటీ క్లబ్ ఎన్నికల్లో



నూతన అధ్యక్షుడిగా పిట్ల రాజేశ్వరరావు, కార్యదర్శిగా పోతల భాస్కరరావు, కోశాధికారిగా పెదిరెడ్ల కిరణ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు సభ్యులుగా ఎన్నికైన ఆర్.వి.పి. సత్యనారాయణ, కుప్పిలి శ్రీనివాసరావు, ధనిమిరెడ్డి శ్రీనుబాబు, పోలిపర్తి అప్పలనాయుడు, కలిగట్ల బాబూరావు, లంక చిన్న, కట్టమూరి నరేష్ కుమార్, రుత్తల అప్పలనాయుడు తదితరులు ఈరోజు రాజేష్‌ను కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. సిటీ క్లబ్ అభివృద్ధికి, సమాజహిత కార్యక్రమాలకు నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా చింతకాయల రాజేష్ వారికి సూచించారు.

# హెచ్పీసీఎల్ యాజమాన్య బాధ్యతారాహిత్య ధోరణి.....

- స్థానిక ప్రజల మండిపాటు......
- కర్మాగార చిమ్నీ నుంచి అధిక మంటలు
- భయభ్రాంతులకు గురైన స్థానిక ప్రజలు
- ప్రజలను అప్రమత్తం చేయలేని పరిస్థితిలో హెచ్పీసీఎల్ అధికారులు.
- లాభాలు మీకా.... కాలుష్యం మా కా!
- పారిశ్రామిక ప్రాంత వాసుల ఆవేదన

**మల్కాపురం: జూలై 14:( మనసులో మాట)**

పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం ,శ్రీహరిపురం, గాజువాక ,తదితర ప్రాంతాల ప్రజలు సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

వివరాల్లోకి వెళ్తే సోమవారం రాత్రి 9 గంటల సమయంలో హెచ్పీసీఎల్ కర్మాగారం లో కొండ వెనుక ప్రాంతాల్లో ఉన్న చిమ్నీ ( ఫ్లేయర్, బ్రోయర్లో) మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడటంతో స్థానిక ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురి అయ్యారు అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు ,పాదాచారులు ఈ కర్మాగారం నుంచి వస్తున్న మంటలను చూస్తూ కొంతసేపు భయాందోళనకు గురి అయ్యారు. సుమారు 30 నిమిషాల తర్వాత ఈ మంటలు సద్దుమనగడంతో



ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 1997 సంవత్సరం ఈ కర్మాగారంలో జరిగిన అతి భారీ పేలుడును ఒక్కసారిగా స్థానిక ప్రజలు గుర్తు చేసుకున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కర్మాగారంలో ఏ ప్రమాదం జరిగినా స్థానిక ప్రజలు భయాందోళనలకు గురికావడం తరచూ జరుగుతూ ఉంది.

**ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలం.......**

హెచ్పీసీఎల్ కర్మాగార యాజమాన్యం కేవలం తమ లాభాల కోసమే పరితపిస్తున్నారే తప్ప ప్రజల ఆరోగ్యాలను ఏమాత్రం పట్టించుకోకపోవడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. లాభాలు మీకా కాలుష్యం మాకా అన్నట్లు స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ఇలాంటి ప్రమాదాలు సంభవించేటప్పుడు చుట్టుపక్కల స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత కర్మాగార యాజమాన్యానికి ఉన్నప్పటికీ ఆ దిశగా యాజమాన్యాలు వ్యవహరించకపోవడంపై పలువురు ప్రజా సంఘ నాయకులు యాజమాన్యం తీరుపై మండిపడుతున్నారు.

**స్థానిక పోలీసులపై ప్రశంసలు......**

సోమవారం రాత్రి 9 గంటల సమయంలో హెచ్పీసీఎల్ కర్మాగారం ఫ్లేయర్ లోంచి వచ్చిన అధిక శాతం మంటలను గుర్తించిన స్థానిక మల్కాపురం పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల సీఐ నరసింహారావు చొరవ తీసుకొని తన సిబ్బందితో ఈ ప్రాంతంలో ప్రతి చోటా పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తూ కర్మాగారంలో ఎటువంటి ప్రమాదము జరగలేదంటూ ఎవరు ఎటువంటి ఆందోళన చెందవద్దంటూ వీధి వీధి ప్రజలకు అవగాహన కల్పించడంతో స్థానిక ప్రజలు కు కొంత ఊరట కలిగింది. దీంతో మల్కాపురం పోలీసులను స్థానికులు అభినందిస్తున్నారు.

సూచిక: 2015 సంవత్సరంలో కర్మాగార విస్తరణ పై హెచ్పీసీఎల్ యాజమాన్యం" ప్రజాభిప్రాయ సేకరణ లో" ఇచ్చిన హామీల విఫలంపై ప్రత్యేక కథనం వచ్చే

# స్వర్గీయ గుండ అప్పల సూర్యనారాయణ విగ్రహంపై ఎమ్మెల్యే శంకర్ స్పష్టీకరణ



**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జూలై 14 , మనసులో మాట...**

శ్రీకాకుళం నియోజకవర్గంలో మాజీ మంత్రి స్వర్గీయ గుండ అప్పల సూర్యనారాయణ విగ్రహాన్ని అత్యంత గౌరవ మర్యాదలతో మరియు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ప్రతిష్ఠించామని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. గుండ అప్పల సూర్యనారాయణ అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన పార్టీకి మరియు నియోజకవర్గానికి చేసిన సేవలను ఎప్పటికీ మరువలేమని ఎమ్మెల్యే శంకర్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పార్టీ పరంగా అప్పల సూర్యనారాయణ కి ఘనంగా సంతాప సభను నిర్వహించామని, ఆ సభకు జిల్లా పార్టీ అధ్యక్షులు మరియు నియోజకవర్గంలోని ప్రజలందరూ హాజరయ్యారని వివరించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురించి వివరిస్తూ, ఈ విషయాన్ని గౌరవ రాష్ట్ర, కేంద్ర మంత్రులు మరియు జిల్లా కలెక్టర్ తో చర్చించి, అందరూ అంగీకరించిన నిర్ణీత స్థలంలోనే విగ్రహాన్ని ప్రతిష్ఠించామని ఆయన తెలిపారు. తాను తెలుగుదేశం పార్టీ తరఫున మరియు కూటమి ప్రభుత్వం తరఫున నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, పార్టీ క్రమశిక్షణను పాటిస్తూనే ఈ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టామని ఆయన పేర్కొన్నారు.

అయితే, ఈ విగ్రహ ఏర్పాటు విషయంలో కొంతమంది కావాలనే గందరగోళం సృష్టిస్తూ, పార్టీ పేరును వాడుకుని నియోజకవర్గంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆరోపించారు. ఇలాంటి పనులు చేసే వ్యక్తులు దొంగలని, వారు పెయిడ్ ఆర్టిస్టులని మరియు పార్టీకి ద్రోహులని ఆయన ఘాటుగా విమర్శించారు. అసలైన తెలుగుదేశం పార్టీ అభిమానులు మరియు గుండ అప్పల సూర్యనారాయణ ని గౌరవించే వారు, ఎటువంటి అల్లర్లకు తావివ్వకుండా కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

త్వరలోనే నియోజకవర్గ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేకంగా ప్రెస్ మీట్ ఏర్పాటు చేస్తామని, అందులో ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో చేపట్టిన పనుల గురించి పూర్తిస్థాయిలో వివరణ ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు.. విగ్రహ ఏర్పాటులో తనదే పూర్తి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

# గొలుగొండ గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

**గొలుగొండ, జూలై 14, (మనసులో మాట) :**

గొలుగొండ మండల కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఎస్సీ కేటగిరీలో మిగిలిన సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. కోటేశ్వరరావు తెలిపారు.

ఖాళీలు ఉన్న తరగతులు సీట్లు ఈ విధంగా ఉన్నాయి.

5వ తరగతి - 48 సీట్లు 6వ తరగతి - 20 సీట్లు

9వ తరగతి - 8 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం - 4 సీట్లు కు ఆసక్తి కలిగిన విద్యార్థులు పాఠశాల కార్యాలయ పని వేళల్లో నేరుగా సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థితో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డుల ప్రతులు టీసీ స్టడీ సర్టిఫికెట్ కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థి ఫోటోలు తీసుకురావాలని తెలిపారు. అన్ని ధ్రువపత్రాలు వెంటనే అందుబాటులో లేకపోయినా ప్రస్తుతం ఉన్న పత్రాలతో ప్రవేశం పొందిన అనంతరం మిగిలినవి సమర్పించవచ్చని పేర్కొన్నారు. గురుకులంలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంటర్మీడియెట్ వరకు నిరంతర విద్యను అభ్యసించే అవకాశంతో పాటు ప్రతిభ ఆధారంగా ఐ ఐ టి,నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక కేంద్రాల్లో ఉచిత శిక్షణ పొందే అవకాశం కూడా ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. పేద అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## తెరవే ఆధ్వర్యంలో సమరయోధుడు గరిమెళ్ళ జయంతి

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జూలై 14, మనసులో మాట..**



శ్రీకాకుళం నగరంలోని కొత్త బ్రిడ్జి రోడ్ లో గల "గరిమెళ్ళ సత్యన్నారాయణ" విగ్రహం వద్ద గరిమెళ్ళ 133 వ జయంతి వేడుకలను మంగళవారం తెలుగు రచయితల వేదిక(తెరవే) ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ "మాకొద్దీ తెల్లదొరతనమూ దేవా" అనే పాటతో గరిమెళ్ళ ఈ ఆంగ్లేయుల గుండెల్లో వణుకు పుట్టించారని , స్వాతంత్ర్య సమరంలో కీలక భూమికను పోషించారనిబికొనియాడారు. జాతీయ కవితా సార్వభౌముని గా, ప్రజా పాటల త్యాగయ్య గా ఎనలేని గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. వావిలపల్లి రాజారావు గరిమెళ్ళ పై కవితను చదివి వినిపించారు. పలువురు తెరవే కవులు గరిమెళ్ళ సిక్కోలు వాసి కావటం గర్వకారణమని ఆయన సేవానిరతిని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో మంగిపూడి శ్రీనివాసరావు, పూడి జనార్ధనరావు, భోగెల ఉమామహేశ్వర రావు, నిక్కు అప్పన్న, కిమ్మి సంతోష్ కుమార్, కొప్పల సూర్యనారాయణ, తలగాన లింగరాజు, బసవ జగన్నాథరావు, తాళ్లూరు విజయలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి దాతల విరాళాలు

**వి. మాడుగుల, జూలై 14 (మనసులో మాట)**



అనకాపల్లి జిల్లా వి మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామ దేవత శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి భక్తులు ఉదారంగా విరాళాలు అందజేశారు. పాడేరు గ్రామానికి చెందిన కామిరెడ్డి జైపాల్ రెడ్డి-లక్ష్మీకుమారి దంపతులు రూ.10,000, ఎం.కోడూరు గ్రామానికి చెందిన బొడ్డు అప్పారావు కుమారుడు రమణ రూ.5,000లను మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవ రావు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస శర్మకు మంగళవారం అందించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను వారి సేవాభావాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారంతో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రూప్2 ప్రిలిమ్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జూలై 14, మనసులో మాట:**

ఏపీపీఎస్సీ గ్రూప్2 (ప్రిలిమ్స్)2026 పరీక్షలకు సిద్ధమవుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల అభ్యర్థుల నుండి ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు, సాధికారిత అధికారి ఐ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో సాధించిన మార్కుల మెరిట్ ప్రాతిపదికన మొత్తం 100 మంది అభ్యర్థులను ఈ శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.ఎంపికైన వారికి రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైపెండ్, ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేస్తామని,శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని వివరించారు.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు (వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉన్నవారు), ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఈ నెల 14/07/2026 నుండి తమ దరఖాస్తులను శ్రీకాకుళం వాంటే కాలనీ (80 అడుగుల రోడ్డు) లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో లేదా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నేరుగా అందజేయవచ్చన్నారు. ఇతర వివరాల కొరకు 8332852106, 7382975679, 9295653489 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు జనసైనికులు సిద్ధం కావాలి

- జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర పిలుపు

**నర్సీపట్నం రూరల్, జూలై 14, (మనసులో మాట) :**



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం నర్సీపట్నంలో పార్టీ ముఖ్య నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులతో సమన్వయంగా పనిచేస్తూ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ ప్రకటించిన త్రిశూల వ్యూహాంను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, స్థానిక పరిస్థితులను బట్టి బలం ఉన్న ప్రాంతాల్లో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల బరిలో నిలవాలని అన్నారు. యువత, మహిళల అభిప్రాయాలు, స్థానిక ప్రజల అవసరాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా పార్టీ కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని, పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, గొలుగొండ మండల అధ్యక్షుడు గండెం దొరబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవీఎంసీ అనకాపల్లి జోన్ కార్యాలయాన్ని సందర్శించిన సహచట్టం కమిషనర్ నాయుడు...

**అనకాపల్లి రూరల్, జూలై 14 (మనసులో మాట):**



రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ పిఎస్ నాయుడు అనకాపల్లి జోన్ కార్యాలయాన్ని సందర్శించారు. రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్ట్ (ఆర్టిఐ)కమిషనర్ అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా పలు కార్యాలయాలు సందర్శించారు.ముఖ్యంగా జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో ఆర్టిఐకి సంబంధించి రికార్డ్స్ ,సిటిజన్ చార్టర్, బోర్డులు మరియు 4. 1 బి అన్ని నిబంధనలకు అనుగుణంగా అమలు చేస్తున్నారా లేదా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టి ఐ ద్వారా వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇన్ టైం లోనే క్లియర్ చేయమని జోనల్ కమిషనర్ డి లక్ష్మి తులసికు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి మూడో శుక్రవారం ఆర్టిఐ కి సంబంధించి జోనల్ కార్యాలయంలో ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆర్టిఐ దరఖాస్తులు క్లియర్ చేయమని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ తులసి దగ్గరుండి అన్ని రికార్డులను కమిషనర్ కు అందుబాటులో ఉంచారు. జోనల్ కార్యాలయంలో సహచట్టం నిబంధనల మేరకు రికార్డులు సక్రమంగా నిర్వహించడం పట్ల కమిషనర్ నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటి సిపిఎస్ ప్రవీణ్ కుమార్, సూపరింటెండెంట్ పి అప్పల నాయుడు,రెవెన్యూ ఇన్స్పెక్టర్ పరదేశి నాయుడు, ఈ ఈ శేఖర్, యూనియన్ నాయకులు అందే శ్రీనివాసరావు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జనాభా పెరుగుదలకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలి







- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జూలై 14, మనసులో మాట:**

జూలై 11 నుండి జూలై 18 వరకు ప్రచారంలో భాగంగా ప్రపంచ జనాభా దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి కార్యాలయం నుండి స్థానిక ఏడు రోడ్ల కూడలి వరకు కుటుంబ సంక్షేమం దేశ సౌభాగ్యం అనే నినాదంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డా. కె. అనిత మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో రెండవ స్థానంలో ఉండే వాళ్లమనీ కాలక్రమేణా జనాభా తగ్గుముఖం పడుతుందని అందుకు కారణం ప్రజల్లో పని వత్తిడి,సకాలంలో వివాహం జరగకపోవడం, ఆర్థికంగా స్థిరపడిన తరువాత వివాహం చేసుకుందామనే ఆలోచనలు వల్ల అని తెలిపారు. పదేళ్లకు ఒకసారి జరిగే జనాభా లెక్కల ప్రకారం 100 మందిలో 11 శాతం పిల్లలుంటే ఇప్పుడు ఆ శాతం గణనీయంగా తగ్గిందని దానిని పెంచే విధంగా ప్రభుత్వం వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకువచ్చి జనాభా పెరుగుదలకు కృషి చేస్తుందని, అందువలన శిశు మరణాలు జరగకుండా చూడాలని, గర్భిణీ స్త్రీలకు సరియైన సమయంలో వైద్యంతో పాటు మంచి పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రజల్లో జనాభా నియంత్రణ, కుటుంబ సంక్షేమం,మహిళల ఆరోగ్యం, మాతాశిశు సంక్షేమం, విద్య మరియు సమాన అవకాశాలపై అవగాహన కల్పించే ప్రభుత్వం, ఇప్పుడు సంపదతో పాటు పిల్లలను కనమని, తద్వారా దేశం జనాభా పెంచడం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందుకు ప్రధాన కారణం దేశ జనాభా తగ్గుముఖం పట్టడమే అని అన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సభలో వక్తలు మాట్లాడుతూ, జనాభా పెరుగుదలకు ప్రజలను చైతన్య పరుస్తూ, కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆరోగ్య సవాళ్లను అధిగమించి శిశు మరణాల సంఖ్య తగ్గించాలని తెలిపారు.

అలాగే మహిళల సాధికారత, బాలికల విద్య, ఆరోగ్య సేవల విస్తరణ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలు ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ప్రతి కుటుంబం బాధ్యతాయుతమైన నిర్ణయాలతో ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా (లక్కీ డిప్) ద్వారా ఎంపిక కాబడిన వారికి నగదు ప్రోత్సాహకాలుగా ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు (లక్కీ డిప్)

# ప్రపంచ సైకాలజిస్టుల దినోత్సవం సందర్భంగా ఏడుగురికి ఘన సన్మానం

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 14 , మనసులో మాట:**





ప్రపంచ సైకాలజిస్టుల అభినందన దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్వాన్స్‌డ్ సైకాలజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఇండియా మరియు జె సి ఐ మెయిన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని విద్యాధరి బి.ఎడ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఆఫ్ సైకో ఎనాలసిస్ అయినా సిగ్మాండ్ ఫ్రాయిడ్ కు పూలదండ వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు జామి భీమశంకర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి , ప్రజలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు , అలాగే గవర్నమెంట్ స్కూళ్లలోనూ, ప్రైవేట్ స్కూళ్లలోనూ, కాలేజీల్లోనూ సైకాలజిస్ట్ లు అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు ,వాళ్ళ సేవలను ప్రభుత్వం గుర్తించాలని తెలియజేశారు, జె సి ఐ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి తమ్మినేని ఉషారాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిస కాకుండా అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఏ పి ఏ ఐ జిల్లా అధ్యక్షులు దూబ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆలోచనలపై అదుపు సాధించగలిగితే విజయం సాధ్యమవుతుందని తెలియజేశారు, అలాగే వ్యక్తి జీవితంలోను, వృత్తి జీవితంలోనూ క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు, అలాగే జిల్లా కార్యదర్శి డాక్టర్ బుడుమూరు సూర్యారావు మాట్లాడుతూ సమాజంలో మానసిక ఆరోగ్యం పై అవగాహన పెంపొందించడంలో సైకాలజిస్ట్ ల పాత్ర ఎంతో కీలకమని, అలాగే వివిధ పాఠశాలల్లో కళాశాలలో ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలలో అర్హత కలిగిన సైకాలజిస్ట్ సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఏడుగురు సైకాలజిస్టులు అయిన కౌన్సిలర్ దుబా సురేష్ , డాక్టర్ బుడుమూరు సూర్యారావు, కౌన్సిలర్ ధర్మాన జోగారావు, డాక్టర్ పొన్నాడ రాజశేఖర్, కౌన్సిలర్ శ్రీమతి పంచాది సూర్య ప్రభ, కౌన్సిలర్ మురళి, కౌన్సిలర్ పసగాడ సూర్యనారాయణ, జె సి ఐ మరియు విద్యాధరి బిఈడి కాలేజ్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు ఘనంగా సన్మానం చేయడం జరిగింది, కార్యక్రమంలో విద్యార్థుల చేత మానసిక ఆరోగ్యం పై ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చక్రవర్తి, కళాశాల కరస్పాండెంట్ బరాటం లక్ష్మణ్ , కళాశాల లెక్చరర్ రమేష్, చాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

# వృద్ధులకు వరంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం

- **చినదొడ్డిగల్లులో 120 మందికి కంటి పరీక్షలు.. 20 మందిని ఉచిత శస్త్రచికిత్స కోసం విశాఖకు తరలింపు**

**నక్కపల్లి, జూలై 14 (మనసులో మాట):**



మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం నిర్వహించిన ఈ శిబిరంలో 120 మంది కంటి రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేంపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెలగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నేత్ర వైద్య సేవలను ముఖ్యంగా వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానవ జీవితంలో కంటి ప్రాముఖ్యతను వివరించిన ఆయన అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య సేవలు అందించిన డాక్టర్ జాక్సన్ మాట్లాడుతూ రోగులకు కంటి చూపు స్థాయిని బట్టి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేసినట్లు చెప్పారు. పరీక్షల అనంతరం 20 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి వారిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్‌కు ఉచిత ఆపరేషన్ కోసం తరలించినట్లు తెలిపారు. ఈ శిబిరానికి కొత్తూరు, రమణయ్యపేట, రేబాక, గుల్లిపాడు తదితర గ్రామాల నుంచి కూడా రోగులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నేత్రాలయ ప్రాథమిక కంటి పరీక్షా కేంద్రం సీనియర్ ఆప్తోమెట్రిస్ట్ ఎన్. చిన్నారావు, నాయకులు మాకిరెడ్డి నాగు, వెలగా విజయ్‌కుమార్, దాడిశెట్టి కిరణ్, కె. కిషోర్, పంపనబోయిన శ్రీను, శరణపు ఆదిబాబు, కిల్లాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ సంకల్పాన్ని, అంబేద్కర్ ఆశయాలను ప్రజలలోకితీసుకువెళ్లాలి....

- **అనకాపల్లి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బొద్దేడ....**
- **దళిత మోర్చా జిల్లా పదాధికారుల సమావేశం....**

**అనకాపల్లి రూరల్, జూలై 14 (మనసులో మాట):**



ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పాన్ని అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అనకాపల్లి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి, దళిత మోర్చా జిల్లా ఇన్చార్జ్ బొద్దేడ నాగేశ్వరరావు కోరారు. అనకాపల్లి జిల్లా బీజేపీ కార్యాలయంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు గోటివాడ సామ్రాట్ కుమార్ అధ్యక్షతన జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. సామ్రాట్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతాల సురేష్ ఆదేశాల మేరకు, అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపు రెడ్డిపరమేశ్వరరావు సహకారంతో జిల్లా అంతా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి బొద్దేడ నాగేశ్వరావు పాల్గొని మాట్లాడుతూ అంబేద్కర్, మోదీ ప్రతిభా పురస్కార్ - 2026 కార్యక్రమాన్నివిజయవంతం చేయడానికి జిల్లా కన్వీనర్లను పార్టీ అధిష్ఠానం నియమించిందన్నారు. అనకాపల్లి జిల్లాకు కన్వీనరుగా కచ్చా శ్రీను, కో కన్వీనర్ గా తోమండ్రు అప్పారావునియమితులయ్యారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సేవా సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, ప్రోత్సహించే ఈ మహత్తర కార్యక్రమాన్నివిజయవంతం చేయడంలో అందరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ కొణతాల సాయి రామ్ ప్రసాద్, జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు భూపతి అప్పారావు, ఉరివిటి పోలమ్మ, మణికంఠ గోవిందరావు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిని సందర్శించిన డిసిహెచ్ఎస్

**పాలకొండ, జూలై14,మనసులో మాట :**



పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రి నీ సందర్శించిన జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి డా జి. నాగ భూషణ రావు రోగులకు అందిస్తున్న డైట్ ను పరిశీలించారు. భోజనాలు ఎలా ఉన్నాయ్ అని రోగులను అడిగి తెలుసుకున్నారు. డైట్ కాంట్రాక్టర్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. డైట్ ను రోజువారీగా పరిశీలిన చెయ్యాలని నర్సింగ్ సూపరింటెండెంట్ దుర్గాభవాని,హెడ్ నర్సులు, విజయ కుమారి, యాదవేశ్వరి, శైలజ, నాగ రత్నం కు డైట్ కు సంబంధించిన అన్ని మీరే చూసుకోవాలని ఆదేశించించారు. ఆయన తో పాటు మెడికల్ సూపరింటెండెంట్ డా కడియం చిరంజీవి , ఆర్ యం ఓ డా కె. రవి కుమార్ లు ఆయన వెంట వున్నారు.పాత బడిన భవనాలు తొలగించాలని సూపరింటెండెంట్ కి ఆదేశించారు.పునర్నిర్మాణం జరుగుతున్న భావనాలు, శస్త్ర చికిత్స గదులు, విభాగాలు పరిశీలించారు. ఏపీ ఎస్ ఎం ఐ డి ఎస్ ఈ ఈ కి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఆయనతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీపై న్యాయ అవగాహన శిబిరం

**విజయనగరం, జులై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**



స్థానిక మహారాజ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ భద్రత, డిజిటల్ లావాదేవీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి డా. ఎ. కృష్ణ ప్రసాద్ సైబర్ మోసాలు, ఫిషింగ్, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా భద్రత, వ్యక్తిగత సమాచార పరిరక్షణ, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం, ఆన్‌లైన్ మోసాల నుండి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని, అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చని వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమానాస్పద సందేశాలు, లింకులు యాప్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కాలభైరవుడికి కాలరాత్రి అమావాస్య మహాభిషేకం

**గాజువాక(మనసులోమాట )జూలై 14**



జీవీఎంసీ పరిధి 65వ వార్డు వాంబే కాలనీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కాలభైరవ స్వామికి శ్రీ స్వర్ణాకర్షణ భైరవ అమావాస్య సందర్భంగా మహాభిషేకం ప్రత్యేక హోమాలు పూజలు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో జరిపించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈరోజు శ్రీ స్వర్ణాకర్షణ భైరవ అమావాస్య 250 సంవత్సరాలకు ఒక్కసారి అధికమాసంలో వచ్చే అమావాస్యను శ్రీ స్వర్ణాకర్షణ భైరవ కల భైరవ కాలరాత్రి అమావాస్య అంటారు. పితృదేవతలకు అత్యంత ప్రీతిపదమైన అమావాస్య కాలభైరవుడికి అభిషేకం హోమంలు చేయడం జరిగిందని దీని వల్ల మన పితృదేవులకు మన కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు , కలుగుతాయని స్వామివారిని కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని దృఢ సంకల్పంతో స్వామిని పూజిచేసి స్వామివారి కృపకు పాత్రులు అవుతారని అన్నారు. గాజువాక ప్రాంతంలో కాలభైరవ దేవస్థానం నిర్మించడం ఎంతో శుభదాయకమని కొనియాడారు పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామివారిని దర్శించుకుని వారి కోరిన కోరికలు తీర్చుకోవలసిందిగా ప్రజలను అభ్యర్థించారు. పూజా కార్యక్రమం రాఘవేంద్ర శర్మ సారథ్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెంటకోట రాజు, పాండురంగ జయరాజ్, హరికృష్ణ, బి. వెంకటేష్, జ్యోతి, ఆదిలక్ష్మి, పద్మ, చిట్టమ్మ, వరలక్ష్మి , రామ ఆలయ కమిటీ సభ్యులు కాలనీ భక్తులందరూ పాల్గొన్నారు.

## ఖురిగాం ఆసుపత్రిలో అడుగడుగునా లోపాలే

- ప్రాణాలమీదకు తెస్తున్న అత్యవసర విభాగం తీరు
- పాముకాటు బాధితురాలు అరగంట నిరీక్షణ..
- స్టాఫ్ నర్స్ అందుబాటులో లేదని గ్రామస్థుల ఆరోపణ
- విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి..



**పాతపట్నం, జూలై 14 మనసులో మాట:**

పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం ఖురిగాం ప్రభుత్వ ఆసుపత్రి లో అత్యవసర వైద్య సేవల నిర్వహణపై గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాముకాటుకు గురైన ఓ మహిళను చికిత్స నిమిత్తం ఖురిగాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చినా, సుమారు అరగంట పాటు ఒక్క స్టాఫ్ నర్స్ కూడా అందుబాటులో లేకపో వడంతో బాధితురాలు చికిత్స కోసం నిరీక్షించాల్సి వచ్చిందని గ్రామస్థులు ఆరోపించారు.పాముకాటు వంటి ప్రా ణాపాయ పరిస్థితుల్లో ప్రతి నిమిషం కీలకమైనదని, అలాంటి సమయంలో వైద్య సిబ్బంది లేకపోవడం ప్రభుత్వ వైద్య వ్యవస్థలోని లోపాలను బయ టపెడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సేవలు అందాల్సిన ఆసుపత్రిలో సిబ్బంది అం దుబాటులో లేకపోతే రోగుల ప్రాణాల కు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.ఈ ఘటనపై స్పందించిన గ్రామస్థులు, ఖురిగాం ప్రభుత్వ ఆసు పత్రి పనితీరుపై సమగ్ర విచారణ జరి పించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు తప్పనిసరిగా విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వెంటనే దృష్టి సారించి, ఆసుపత్రి పరిస్థితులను పరిశీలించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అదే విధంగా, గ్రామస్థులతో కలిసి ఐటీడీపీ అధ్యక్షుడు శేపాన విక్రమ్ కూడా ఖురిగాం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను మెరుగుప రచాలని, ప్రజలకు నాణ్యమైన అత్యవ సర వైద్యం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి .

## రైతులకు వరి పంట సాగుపై శిక్షణ : భానులత



**శృంగవరపుకోట, జూలై 14: (మనసులో మాట )**

కొత్తవలస మండలంలోని గనిసెట్టిపా లెం రైతు సేవ కేంద్రం పరిధిలో వ్యవ సాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా వ్యవసాయ సహాయ సంచాలకులు బి భానులత అధ్యక్షతన రైతులకు వరిపంట సాగు పై శిక్షణ అందించారు , ఈ కార్య క్రమంలో పాల్గొన్న ఆత్మ డిప్యూటీ డైరె క్టర్ మహారాజన్ మాట్లాడుతూ రైతులు వీలైనంత వరకు వరి విత్తనాలను సొంతంగా కట్టుకోవాలని, నారుమడి సిద్ధం చేసుకోవటానికి ముందే మొలకశా తం కట్టుకొని, మొలకశాతం బాగుంటే విత్తనశుద్ధి చేసి నారుమడి తయారు చేసుకోవాలని తెలిపారు, అలాగే ఈ కా ర్యక్రమంలో పాల్గొన్న ప్రధాన శాస్త్రవేత్త , ఏరువాక కేంద్రం విజయనగరం డా లక్ష్మణ్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఎల్ నినో ప్రభావాన్ని రైతులు కొన్ని పద్ధ తుల మార్పులతో ఎదుర్కోవచ్చు అని, నాట్లువేసే పద్ధతి కాకుండా వెద పద్ధతి లో వరి పండించటం మేలైన పద్ధతి అని, అలాగే ఎరువుల వినియోగం కూడా తగ్గించాలి అని, వెదపద్ధతిలో కలుపు నివారణ కోసం 48 గంటలలోపు పెం డిమిథలిన్ ఒక లీటర్ ఒక ఎకరానికి, 2 నుంచి 5 రోజుల లోపు అయితే పైరిజో సల్ఫ్యూరాఇథైల్ (సాథీ) 100 గ్రాములు ఎకరానికి, 12 నుంచి 15 రోజుల లోపు కౌన్సిల్ ఆక్టివ్ 90 ml , 15 రోజుల పైన దాటిన అయిన అన్నిరకాల కలుపు నివా రణకు డిస్పైర్బాక్ సోడియం 80 100 ఎం ల్ ఎకరానికి పిచికారీ చేసి కలుపును సమర్థవంతంగా నియంత్రించవచ్చు ఆయన తెలిపారు, ఏడిఏ భానులత మాట్లాడుతూ రైతులందరికీ కావలసిన విత్తనాలు మరియు ఎరువులు అన్నిరైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే వి రామ్ ప్రసాద్ , ఏఈఓ గణేష్, గ్రామ ఉద్యాన సహాయ కులు రవి ప్రకాశ్ , జ్యోతి , ఏంపిఈఓ కుమారి, వ్యవసాయ సహాయకుడు దు ర్గారావు , ప్రకృతి వ్యవసాయ మండల కో ఆర్డినేటర్ సన్యాసమ్మ, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు

## ఫీజు బకాయిలు చెల్లించి గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**పార్వతీపురం జిల్లా ప్రతినిధి , జూలై-14, మనసులో మాట:**



విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా అఖిల భారత విద్యా ర్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) పార్వతీపురం మన్యం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగ ళవారం పార్వతీపురంలో కలెక్టర్ కార్యాల యం ఎదుట భారీ విద్యార్థి ర్యాలీ,ఆందోళన జిల్లా కార్యదర్శి రవి నాయకత్వం లో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహిం చారు.అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్య క్షులు గుజ్జల వలరాజు మాట్లాడుతూ.... రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరి స్తూ ప్రకటనలకు మాత్రమే పరిమితమైం దని విమర్శించారు, విద్యా శాఖ మంత్రి అధి కారంలోకి వచ్చిన 100 రోజుల్లో బకాయిలు విడుదల చేస్తాం, 77,జీవో రద్దు చేస్తాం, రాష్ట్రంలో ప్రతి ఒక్క విద్యార్థి కి చదువుకునే అవకాశం కల్పిస్తామన్న విద్యాశాఖ మంత్రి నేటికీ రెండు సంవత్సరాలు అవుతున్న ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా సూపర్ సిక్స్ విజన్ చంద్రబాబు, డబల్ ఇంజన్ సర్కార్ అంటూ రెండేళ్లలో విద్యార్థులకు చేసిందేమీ లేదని, ఆగ్రహం వ్యక్తం చేశారు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నిత్యావసర వస్తు వుల ధరలు పెరిగిన నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు మెస్ ఛార్జీలను రోజుకు రూ.100కు పెంచాలని కోరారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారిన జీఓ నెం.77ను వెంటనే రద్దు చేయాలని,గిరిజన సంక్షేమ ఆశ్రమ పా ఠశాలల్లో తరగతుల కుదింపును ఉపసంహ రించుకోవాలని,రాష్ట్రవ్యాప్తంగా మూతపడిన 4,500 ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారం భించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాడునేడు కార్యక్రమంలో నిలి చిపోయిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్ఎంఎ పోస్టు లను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ హాస్ట ళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. గిరిజన విద్యార్థులు మరణం పై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

## నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కె. శ్రీనివాసరావు



**విజయనగరం, జూలై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్ కార్యక్రమాన్ని జిల్లాలోని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ, సాధి కారిత అధికారి కె. శ్రీనివాసరావు నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవా రం జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని 6 ఆశ్రమ పాఠశాలలు, 2 కళాశాల వసతి గృహాలకు చెందిన నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోలార్ విద్యుత్ వినియోగం, గ్రీన్ క్యాంపస్‌ల అభివృద్ధి, మొక్కల పెంపకం, కిచెన్, హెర్బల్ గార్డెన్ల ఏర్పాటు, వర్షపు నీటి సం రక్షణ, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్/ వివిజిరామ్ (జి) మార్గదర్శకాల మేరకు ప్లాంటేషన్, నీటి సంరక్షణ పనులను చేపట్టి, సంబంధిత రికార్డులు, ఫోటోలు, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ విద్యాసంస్థల్లో గ్రీన్ కమిటీస్ , ఎకో క్లబ్స్ ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పర్యావరణ పరి రక్షణపై అవగాహన పెంపొందించాలని సూచించారు.

## బీచ్ షాక్స్ నిలిపివేసి జీవో 362 రద్దు చేయాలని డిమాండ్

**విశాఖపట్నం, మనసులోమాట , జూలై 14:**





రాష్ట్రంలోని విశాఖ బీచ్ తో పాటు పలు బీచ్ లలో బీచ్ షాక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మద్యం అమ్మ కాలను నిలిపివేసి, జీవో నెంబర్ 362ను రద్దు చేయాలని మహిళా సంఘాల ఐక్యవే దిక నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమా వేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాలతో పాటు, ప్రజా, దళిత బహుజన, యువజన సంఘాల, విద్యార్థి, కార్మిక నేతలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిఒడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం లక్ష్మి మాట్లాడుతూ బీచ్ లో మద్యం అమ్మకాల వల్ల బీచ్ సంద ర్శకులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. బీచ్ లో యువతీ యువకులు కూర్చుని పెగ్గు వేసుకుంటే తప్పు ఏంటని బాధ్యత రాహితంగా శాసన సభాపతి అయ్యన్నపా త్రుడు మాట్లాడుతున్నారన్నారు. నీటిపై కేసినో అవసరమంటున్నారని దుయ్య బట్టారు. ఐద్వా నాయకురాలు పద్మ మా ట్లాడుతూ విశాఖ నగరాన్ని ముఖ్యంగా బీచ్ ను మత్తులో ఉంచడానికి ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని మం డిపడ్డారు. దశల వారి ఉద్యమంతో ప్రభు త్వానికి తగిన గుణపాఠం చెప్తామన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు నేత ఏ.విమల మాట్లాడు తూ గతంలో లవ్ ఫెస్టివల్ ను, అందాల పోటీలను ఆపగలిగామని, అదేవిధంగా దీనిని అడ్డుకుంటామన్నారు. సి ఎం ఎస్ నాయకురాలు లలిత మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే వారే మద్యం కాంట్రాక్టర్లుగా ఉంటున్నారని తెలిపారు. విద్య, ఆరోగ్యం ప్రజలకు అందివ్వలేని ప్రభుత్వం, మద్యం మాత్రం సమృద్ధిగా అందిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాది గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్రం లో సగానికి పైగా మద్యం షాపులు నిబంధ నలకు వ్యతిరేకంగానే నడుస్తున్నాయన్నా రు. కార్యక్రమంలో భీమ్ సేన వార్ ప్రధాన కార్యదర్శి డా. వసంత రాజేంద్రప్రసాద్, జన విజ్ఞాన వేదిక మురళీధర్, డిహెచ్‌పిఎస్ రాంబాబు, భీమ్ సేన ఉపాధ్యక్షుడు వి.వి. దుర్గారావు, నిర్మల, రోహిణి, సిఐటియు, ఏఐటియుసి, ఎస్ఎఫ్ఐ ,డివైఎఫ్ఐ, ఎం ఎంఎస్ఎస్, తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

# విశాఖ జూ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక....

- పోస్టుల భర్తీ, సీఎస్ఆర్ నిధులతో మెరుగైన వసతుల కల్పన.
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక:
- అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు






**నర్సీపట్నం రూరల్/ విశాఖపట్నం, జులై 14, ( మనసులో మాట) :**

విశాఖపట్నం జంతు ప్రదర్శనశాల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టమైన ప్రణాళికను వివరించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పర్యావరణం, జంతు సంరక్షణ కోసం శాసనసభ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ హోదాలో ఆయన 12 మంది సభ్యుల బృందంతో కలిసి మంగళవారం విశాఖ జూను ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది పర్యాటకులు వచ్చే విశాఖపట్నం, తిరుపతి జూ పార్కులను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పీకర్ స్పష్టం చేశారు. విశాఖ జూలో సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో 1400లకు పైగా పక్షులు, జంతువులు ఉన్నప్పటికీ వాటికి వైద్యం అందించడానికి కేవలం ఒక డాక్టర్, ఒక హెల్పర్ మాత్రమే ఉండటంపై స్పీకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వన్యప్రాణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రోజుకు మూడు నుంచి నాలుగు వేల మంది సందర్శకులు వస్తున్నప్పటికీ, వారికి సరిపడా మరుగుదొడ్లు, తాగునీరు, క్యాంటీన్ వంటి కనీస సౌకర్యాలు లేవని కమిటీ గుర్తించిందని తెలిపారు. పిల్లల వినోదం కోసం సాయంత్రం వేళల్లో ప్రత్యేక కార్యక్రమాలు, టాయ్ ట్రైన్ లాంటి సదుపాయాలు తీసుకురావాలని అధికారులకు సూచించారు. జూ పార్క్ నిర్వహణకు ఏటా సుమారు పది కోట్ల రూపాయలు అవసరం కాగా, ప్రస్తుతం 7.5 నుంచి 8 కోట్ల రూపాయల ఆదాయం మాత్రమే వస్తోందని స్పీకర్ వివరించారు. ఈ ఆర్థిక లోటును అధిగమించేందుకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని పరిశ్రమల నుంచి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద 3 నుంచి 4 కోట్లు సేకరించాలని కలెక్టర్‌కు సూచించారు. స్థానిక ఎంపీలు, రాజ్యసభ సభ్యుల నిధులు, జాతీయ బ్యాంకుల సహకారాన్ని కూడా అభివృద్ధి కోసం వినియోగించుకుంటామన్నారు. ప్రభుత్వం సింగపూర్ బృందంతో చర్చలు జరుపుతూ కైలాసగిరితో పాటు జూను ఒక సుందరమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అధికారుల సూచనలు, మీడియా సలహాలు స్వీకరించి జంతు సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదిక అందజేస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

# సెల్ టవర్ నిర్మాణానికి గొయ్యి తీసి వదిలేసారు....



**కోటవురట్ల (మనసులో మాట) జులై 14:**

మండలంలో గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణం కోసం రెండు నెలల కిందట గొయ్యి తీసి వదిలివేశారు.ఈ ఏడాది జనవరి నెలలో గ్రామంలో పర్యటించిన హోం మంత్రి వంగలపూడి అనిత గిరిజనుల కోరిక మేరకు సెల్ టవర్ మంజూరుకు హామీ ఇచ్చారు.ఆమె ఇచ్చిన హామీ మేరకు గ్రామానికి బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ మంజూరు అయింది.సిబ్బంది వచ్చి గొయ్యి తీసి వెళ్లిపోయారు. తర్వాత దాని విషయమై ఎవరు పట్టించుకోలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతిలో నీళ్లు చేరాయి. పిల్లలు అదే ప్రాంతంలో రోజు ఆడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం కొత్తూరులో ఎరువుల పంపిణీ ప్రారంభం

- కొత్తూరులో ఎరువుల పంపిణీ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు..



**పాతపట్నం, జులై 14 మనసులో మాట :**

రైతుల అభ్యున్నతి, వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు అన్నారు. పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎరువుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు ఎరువులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి పెరిగి, రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని తెలిపారు. పంటల సాగులో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని చెప్పారు.వ్యవసాయంలో ఎరువుల వినియోగం కీలకమని పేర్కొన్న ఆయన, శాస్త్రీయ పద్ధతుల్లో సరైన మోతాదులో ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల నాణ్యతతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, సాగునీటి సౌకర్యాల కల్పనతో పాటు రైతుల సంక్షేమానికి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని కోరారు.కార్యక్రమంలో రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రైతుల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు లోతుగెడ్డలక్ష్మీనారాయణ నాయుడు, పడాల వెంకటకృష్ణ, లోతుగెడ్డ జనార్ధనరావు తదితరులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

# అసత్య ఆరోపణలపై మహిళకు చట్టపర చర్యలు కోరుతూ ఫిర్యాదు

**నర్సీపట్నం: జులై 14 (మనసులో మాట )**



తనపై ఒక మహిళ చేసిన అసత్య, నిరాధార ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించి, వాస్తవాలను వెలికితీసి, తప్పుడు ఆరోపణలు చేసిన మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సీనియర్ నాయకులు, వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ అప్పన ఎన్. ఎస్. జి. దొరబాబు నర్సీపట్నం టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గఫూర్ ఖాన్ కి సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతో కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని కోరారు. చట్టంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు.

ఈ ఫిర్యాదును స్వీకరించిన టౌన్ సీఐ ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు..

# రెండు లీటర్ల హాషీష్ (లిక్విడ్ గంజాయి) స్వాధీనం





- ఐదుగురు అరెస్ట్..
- రూ 33 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం
- నర్సీపట్నం డిఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి

**నర్సీపట్నం రూరల్, జులై 14, (మనసులో మాట) :**

నర్సీపట్నం రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని గొలుగొండ మండలం ఏటి గైరంపేట వద్ద రెండు లీటర్ల హాషీష్ ( లిక్విడ్ గంజాయి ) తో పాటు, రెండు కిలోల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని ఐదుగురిని అరెస్టు చేశారు. మంగళవారం నర్సీపట్నం డిఎస్పి పి శ్రీనివాసరావు విలేకరులకు వివరాలను వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, గొలుగొండ, కృష్ణదేవిపేట ఎస్సైలు పి రామారావు, రిషికేశ్వర రావు, తమ సిబ్బందితో ఏటి గైరంపేట గ్రామ శివారులో మాటువేసి, మూడు మోటార్ సైకిళ్ల పై వస్తున్న ఐదుగురు వ్యక్తులు తమ చేతి సంచిలోని మాదక ద్రవ్యాలను ఒక వాహనం నుండి మరొక వాహనం కు మార్చే సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రెండు లీటర్ల హాషీష్, రెండు కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేశారన్నారు. ఈ కేసులో అల్లూరి జిల్లా చింతపల్లి మండలం గిల్లెల బంధ గ్రామానికి చెందిన వెచ్చంగి కోటేశ్వరరావు (20), కొయ్యూరు మండలం కొండసంత గ్రామానికి చెందిన కర్రి ధారబాబు (37), అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ఏటి గైరంపేట కు చెందిన గూనూరు వెంకు నాయుడు (32), కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామానికి చెందిన బోడుం సాయి (23), ఆర్ బి కొత్తూరు గ్రామానికి చెందిన కాదా సంతోష్ కుమార్ (19) లను అరెస్టు చేసి వారి వద్ద నుండి హాషీష్, గంజాయితో పాటు మూడు మోటార్ సైకిళ్ళు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ. 33 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసులో నిందితులకు మత్తు పదార్థాలు విక్రయించిన ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ లోని మునుపల్లి గ్రామానికి చెందిన బచ్చల మోహన్ అనే వ్యక్తికి పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నామన్నారు. పట్టుబడిన వారిపై ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డి.ఎస్.పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, గొలుగొండ, కృష్ణ దేవి పేట, నర్సీపట్నం రూరల్ ఎస్సైలు రామారావు, రిషికేశ్వరరావు, రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా డిమాండ్




**విశాఖపట్నం, జూలై 14, మనసులోమాట :**

విశాఖ కేంద్రంగా జూన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు మొదల వ్వడంతో రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, దక్షిణ కోస్తా రైల్వే జోన్ కేంద్ర మైన విశాఖలో రైల్వే రిక్రూట్మెంట్ బోర్డుని వెంటనే ఏర్పాటు చెయ్యాలని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లోక్ సత్తా రాసిన లేఖను మంగళవారం ఎమ్.వి.పి ఉషోదయ కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ విశాఖలో ఆర్ ఆర్ బీ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలోని లోని నిరుద్యోగులకి ఊరట కలుగుతుందన్నారు. అనేక నైపుణ్యాలు కలిగిన యువత ఉత్తరాంధ్రలో ఉన్నార ని వీరందరికీ రైల్వే ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని లోక్ సత్తా అభిప్రాయ పడుతుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా జోన్ ప్రధాన కార్యాలయం ఉండే చోటే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు కార్యాలయం ఉందన్నారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్ ఆర్ బీ ని అమరావతిలో పెట్టమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం బాధ కలిగించిందని, కేంద్రం అనవసరంగా అమరావతిలో ఆర్ ఆర్ బీ ని పెట్టి రాష్ట్ర ప్రజలను కన్ఫ్యూజ్ చెయ్యవద్దని తెలిపారు. జోన్ ప్రధాన కార్యాలయం ఉండే చోట 128 మంది గెజిటెడ్ అధికారులు, 11వందల మంది నాన్ గెజిటెడ్ అధికారులు ఉంటారని నోటిఫికేషన్ విడుదల సమయంలో అభ్యర్థులకు కావలసిన సహాయ సహకారం అందిస్తారన్నారు. విశాఖలో కాకుండా ఆర్ ఆర్ బీ అమరావతిలో పెడితే ఉత్తరాంధ్ర ప్రజలకి చంద్రబాబు నాయుడు అన్యాయం చేసిన వారుగా మిగిలిపోతారని కాబట్టి ఉత్తరాంధ్ర లోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు చంద్రబాబు నాయుడు పై వత్తిడి తేవాలని భీశెట్టి కోరారు. సమావేశంలో లోక్ సత్తా విశాఖ నాయకులు రెడ్డి మురళీధర రావు, మాతృభూమి సేవా సంస్థ ప్రతినిధి ఇప్పలవలస గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

## చీడికాడలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

**చీడికాడ, జూలై 14, (మనసులో మాట)**



ఖరీఫ్ 2026 సంవత్సరానికి సంబంధించి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఈ 14 నుండి 14 వారాలు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వయించడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగినదని మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి తెలిపారు మండలంలో చీడికాడ జి కొత్త పల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి చీడికాడ వెటర్నరీ డాక్టర్ రాఘవమ్మ కెవికె కొండెంపూడి ఎస్ఎంఎస్ బాబు హాజరవడం జరిగింది. రైతులకు ఏపీ ఏ ఎం ఎస్ యాప్ ద్వారా ఎరువుల సరఫరా గురించి వివరించడం జరిగింది.ఎల్ నినో ప్రభావం వలన ఉన్న వర్షాభావ పరిస్థితులపై చర్చించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడం జరిగినది .

ఈ ఖరీఫ్ సీజనుకు ప్రతి ఒక్క రైతు కూడా వారు సాగు చేస్తున్న పంటలను ఈ పంట యాప్ లో నమోదు చేసుకోవాలని, దీని ద్వారా వ్యవసాయ సంబంధిత పథకాలకు అర్హత ఉంటుందని చేయడమైనది. వెటర్నరీ డాక్టర్ గ పశుగ్రాస పంటల సాగులో రైతులు పాటించవలసిన ముఖ్య విషయాలు మన ప్రాంతానికి అనువైన పశుగ్రాస పంటల గురించి మరియు సమగ్ర పశు పోషణ గురించి వివరించడం జరిగినది.* కెవికె కొండెంపూడి ఎస్ఎంఎస్ మాట్లాడుతూ ఆధునిక యంత్ర పరికరాల వినియోగంపై రైతులకు వివరించడం జరిగినది. రైతులందరూ తమకున్న విస్తీర్ణంలో కొంత భాగం లో ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని సూచించారు ఈ కార్యక్రమంలో కోనాం రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గండి ముసలి నాయుడు పాల్గొన్నారు

# దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతుల పంపిణీ

- **గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి**

**విజయనగరం, జూలై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**



జిల్లాలో దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ సంయుక్తంగా 'ఎల్ ఎన్ ఫోర్ హ్యాండ్' ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి ఉచితంగా కృత్రిమ చేతులను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. సేవే లక్ష్యంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మోచేతి వరకు చేతులు లేని వారికి ఉచితంగా కృత్రిమ చేతులను అందజేస్తారు. ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోదలచిన అర్హులైన దివ్యాంగులు విజయనగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లేదా రోటరీ క్లబ్ కార్యాలయాలను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల శాఖ ఏడి చంద్రకళ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంది వెంకట రమణ, సెక్రటరీ కె. సత్యం, రోటరీ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, సెక్రటరీ నిర్మల్ కుమార్ జైన్, హేమ కుమార్, మండా కే. రవి, జి. శివకుమార్, రెడ్ క్రాస్ ప్రతినిధులు ఎం. రాము, పి. దుర్గాప్రసాద్, రోటరీ క్లబ్ సభ్యులు బి. చందు, డాక్టర్ సంతోష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాల కోసం 9949750552, 9493092700, 08922272700, 9182615056, 9849653053, 8459179307 నంబర్లలో సంప్రదించవచ్చని వారు సూచించారు.

## ఇక నుండి బీచ్ రోడ్డులో రోడ్డు పక్కన 'నో పార్కింగ్'....

- **ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు - డీసీపీ హెచ్చర**

**విశాఖపట్నం, జూలై 14, మనసులోమాట:**



నగరంలోని బీచ్ రోడ్డులో కురుపాం జంక్షన్ నుంచి రోప్‌వే రోడ్డు వరకు వాహనాల అస్తవ్యస్త పార్కింగ్ కారణంగా రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. బీచ్ రోడ్డులోని హోటళ్లు, రెస్టారెంట్లు, వాణిజ్య సంస్థల ఎదుట వినియోగదారులు రోడ్డు పైనే వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని గుర్తించిన అధికారులు సంబంధిత యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) ఎ. నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ద్వారకా సర్కిల్ సీఐ ప్రభాకరరావు, ఎంవీపీ ట్రాఫిక్ ఎస్ఐ రామమూర్తి పాల్గొని ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ అధికారులు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి హోటల్, రెస్టారెంట్, వాణిజ్య సంస్థ తమ ప్రాంగణంలోని పార్కింగ్ స్థలాన్ని పూర్తి స్థాయిలో వినియోగించాల్సిందేనని స్పష్టం చేశారు. వినియోగదారుల వాహనాలను రోడ్డుపై కాకుండా సంస్థల సొంత పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలిపేలా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే వాలెట్ పార్కింగ్ సదుపాయం కల్పించడం, పార్కింగ్ మార్గనిర్దేశం చేసే సిబ్బందిని నియమించడం, రోడ్డుపై పార్కింగ్ నిషేధం, పార్కింగ్ ప్రాంగణంలో మాత్రమే అనే హెచ్చరిక బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, భద్రతా సిబ్బంది నియామకం ద్వారా పార్కింగ్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అలా కాకుండా రోడ్డుపై వాహనాల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడితే సంబంధిత హోటల్, రెస్టారెంట్ లేదా వాణిజ్య సంస్థ యాజమాన్యానికే బాధ్యత ఉంటుందని అదనపు డీసీపీ ఎ. నరసింహమూర్తి ఈ మేరకు స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరించే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే జరిమానాలు, ఇతర చర్యలు కూడా చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పాల్గొన్న అన్ని సంస్థల ప్రతినిధులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పూర్తిగా అమలు చేస్తామని, బీచ్ రోడ్డులో ట్రాఫిక్ సజావుగా సాగేలా పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## నర్సీపట్నం ఎన్ డి ఏ కూటమిలో జనసేనకు తీవ్ర అన్యాయం జరుగుతుంది

- **నర్సీపట్నం జనసేన నాయకుల ఆవేదన**

**నర్సీపట్నం, జూలై 14, (మనసులో మాట) :**



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం కూటమిలో జనసేనకు తీవ్ర అన్యాయం జరుగుతుందని నియోజకవర్గానికి సంబంధించిన పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జోగినాధుని పాలెంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ...

జనసేన నాయకులు ఎవరైతే చురుకుగా కార్యక్రమాలలో పాల్గొంటున్నారో వారిపై ఏదో రకముగా ఒత్తిడి తీసుకువచ్చి జనసేనను నర్సీపట్నంలో నిర్వీర్యం చేయడానికి కూటమి నాయకులే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. జనసేన నాయకుడు అప్పన దొరబాబు మీద సోమవారం నర్సీపట్నం పోలీస్ స్టేషన్ లో సత్య దూరమైన కేసు పెట్టడం జరిగిందని, పోలీసులు కనీసం విచారణ చేయకుండా ,ఎటువంటి సాక్ష్యాలు లేకుండా దొరబాబుపై కేసు పెట్టడాన్ని నర్సీపట్నం జనసేన తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎవరైతే దొరబాబు మీద ఫిర్యాదు చేశారో సదరు మహిళకు, దొరబాబుకు మధ్య ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదని, కూటమి నాయకుల ఒత్తిడితోనే పోలీసులు దొరబాబుపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారని నర్సీపట్నం జనసేన పార్టీ భావిస్తుందన్నారు. దీనిపై స్పందించి తగు న్యాయం చేయవలసిందిగా ఇప్పటికే దొరబాబు జనసేన పార్టీ అధిష్టానానికి విన్నవించడం జరిగిందన్నారు. ఎలక్షన్లో కూటమి గెలుపు కోసం తాము ఎంతో కృషి చేశామని, ఎలక్షన్ తరువాత జనసేన నాయకులను కూటమి పెద్దలు పట్టించుకోలేదని జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ సవరింపు.....

- జులై 24 వరకు ఇంటింటి సర్వే
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, జులై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను సవరించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజ్ఞప్తి మేరకు ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే కార్యక్రమం జులై 24, 2026 వరకు కొనసాగుతుందని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణను జులై 24 నాటికి పూర్తి చేయాలని సూచించిందన్నారు. ముసాయిదా ఓటరు జాబితా జులై 31న ప్రచురితమవుతుందని, తదుపరి జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని, వాటి పరిష్కారం సెప్టెంబర్ 28 నాటికి పూర్తిచేసి, అక్టోబర్ 3, 2026న తుది ఓటరు జాబితా ప్రచురితమవుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని అర్హులైన ప్రతీ ఓటరు ఇంటింటి సర్వే సమయంలో బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని, వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలు, రాజకీయ పార్టీలు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి, ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని ఆయన పిలుపునిచ్చారు.

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ డిజిటలైజేషన్ శతశాతం పూర్తి

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో విజయనగరం జిల్లా మరో కీలక మైలురాయిని చేరుకుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4.00 గంటల నాటికి జిల్లాలోని 1,847 మంది బూత్ స్థాయి అధికారులు (BLOలు) తమ పరిధిలోని 15,78,949 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల (EFs) పంపిణీని శతశాతం (100%) పూర్తి చేయడంతో పాటు, అందిన అన్ని ఫారాల డిజిటలైజేషన్‌ను కూడా 100 శాతం పూర్తి చేశారని వెల్లడించారు. జిల్లాలోని అన్ని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు పూర్తి స్థాయిలో ఈ లక్ష్యాన్ని సాధించడం విశేషమన్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు:

రాజాం - 2,29,880 ఈఎఫ్‌లు పంపిణీ, 100% డిజిటలైజేషన్

బొబ్బిలి - 2,33,621 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్

చీపురుపల్లి - 2,07,471 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్

గజపతినగరం - 2,07,402 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్

నెల్లిమర్ల - 2,14,418 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్

విజయనగరం - 2,61,300 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్

శృంగవరపుకోట - 2,24,857 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన అన్ని ఎన్నికల అధికారులు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు మరియు సంబంధిత సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఓటరు జాబితా నాణ్యతను మరింత మెరుగుపరచడంలో ప్రతి ఒక్కరి సహకారం ఎంతో విలువైనదని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తదుపరి ప్రక్రియలను కూడా అదే నిబద్ధతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# క్రమశిక్షణతోనే విద్యార్థుల పురోగతి

- ప్రార్థనా సమయానికే పాఠశాలకు ఎంఈఓ సుకుమార్
- మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



**చీడికాడ, జూలై 14, (మనసులో మాట)**

మండలంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల అడివి అగ్రహారాన్ని మండల విద్యాశాఖ అధికారి ఎస్. సుకుమార్ మంగళవారం ప్రార్థనా సమయానికి సందర్శించారు. ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులతో మాట్లాడి క్రమశిక్షణ, విద్యా పురోగతికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిరంతర అభ్యాసంతో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల పురోగతికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిర్ణీత సమయానికి పాఠశాలకు హాజరై నాణ్యమైన బోధన అందించాలని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించిన ఎంఈఓ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆయాకు సూచించారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో నాగులపల్లి వాసి చిన్నారావు మృతి



**మునగపాక, జులై 14, మనసులో మాట**

మునగపాక మండలం, నాగులపల్లి గ్రామం,పొట్టి బీటీ సెంటర్, దాడి వారి వీధికి చెందిన మారిశెట్టి చిన్నారావు (26,సంవత్సరాలు) చిన్న వయస్సులోనే కుటుంబ బాధ్యత ను తీసుకుని 10 ఏళ్ళగా తన వృత్తి అయిన ఎలక్ట్రీషియన్ లోనే కాక,తన పలకరింపు,మాటలు,చేష్టలతో అందరినీ నవ్విస్తూ ప్రతీ ఇంట్లో కుటుంబం సభ్యునిగా అందరి గుండెల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. శనివారం లంకెలపాలెం నుండి అనకాపల్లి వస్తున్న సమయంలో స్కూటీ అదుపు తప్పి తలకి తీవ్రగాయం అవడంతో అపస్మారక స్థితి లోకి వెళ్లిపోయి నిన్న సాయంత్రం బ్రెయిన్ డెడ్ కి గురి కావడం జరిగింది.. బ్రతినంతకాలం 10 మందిని నవ్విస్తూ,సాయం చేసిన చిన్నారావు మరణాంతరం కూడా అవయవ దానాలు చేసి 10 మందికి జీవితాన్ని ఇచ్చి చిరంజీవి అయ్యాడు. కుటుంబ సభ్యులు,బంధువులు,గ్రామస్థులు,స్నేహితులు అందరూ తన హఠాత్మరణాన్ని జీర్ణించుకోలేక శోకసంద్రంలో మునిగిపోయారు.. బుధవారం ఉదయం 7 గంటలకు అంతిమ యాత్ర జరగనున్నది.

# ఆరికివలస పాఠశాలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ.....



**టెక్కలి, జులై 14 (మనసులో మాట) :**

టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాలి మండలం పరిధిలో గల ఆరికివలస ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి జె. చిన్నవాడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఆయన పాఠశాల మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కింద కూర్చొని సహపంక్తి భోజనం చేసి, భోజన నాణ్యత పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. భోజనానంతరం, ఆయన తరగతుల వారీగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ,వారి అభ్యసన నైపుణ్యాలను పరిశీలించారు. పాఠశాల సమగ్ర పనితీరు, విద్యా బోధన , మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ చాలా బాగుందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లఖినాన వెంకటరమణ, ఉపాధ్యాయిని టి.హరిప్రియ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# లక్షల వ్యయం వృథా వాడ్రాపల్లి ఎత్తిపోతల పథకం నిరుపయోగం





**మునగపాక, జులై 14, మనసులో మాట**

మండలంలో వాడ్రాపల్లి పారిపల్లమ్మ ఎత్తిపోతల పథకం ద్వారా వాడ్రాపల్లి ఆవనుండి రైతులకు సమృద్ధి జలాలను పంటలకు అందించేందుకు 2001వ సంవత్సరంలో అప్పటి పరవాడ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సహకారంతో 36 లక్షల రూపాయలతో శ్రీ పారిపెల్లమ్మ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. సుమారు 333 ఎకరాలకు 300 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అయితే ప్రారంభం నుండి కొన్ని ఏళ్లుగా సమృద్ధి జలాలను వాడ్రాపల్లి ఆవనుండి నుండి ఎత్తిపోతల పథకం ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరు అందించేవారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ భూములు సస్యశ్యామలంగా సమృద్ధిగా పంటలు పండి రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరేది. అప్పట్లో శ్రీ పారిపెల్లమ్మ ఎత్తిపోతల పథకం చైర్మన్గా అప్పటి గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, కార్యదర్శిగా ఎల్లపు సూర్య అప్పారావును నియమించారు. కొద్దికాలం సజావుగానే పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. అయితే ఇటీవల కాలంలో ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా పట్టించుకోకపోవడం వల్ల వృధాగా పడి ఉంది. మధ్యలో కొద్దిగా డబ్బు మంజూరు కావడంతో ఎత్తిపోతల పథకం బిల్డింగ్ కు రంగులు వేసి మమ అనిపించారు. ఈ పథకం పై పూర్తిగా నిర్లక్ష్యపు నీడలు ఆవరించుకోవడంతో మూలన పడి మోటార్లు మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆయన ఎత్తిపోతల పథకంపై దృష్టి సాధించి ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సమృద్ధిగా నీటి జలాలను పంటలకు సాగు జరిగే విధంగా కృషి చేయాలని పలు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# నగర సుందరీకరణకు ఎమ్మెల్యే అదితి గజపతి పరిశీలన





**విజయనగరం టౌన్, జులై 14 (మనసులో మాట) :**

నగరంలోని వివిధ ప్రధాన కూడళ్ల సుందరీకరణ నిమిత్తం స్థానిక శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కమిషనర్ బాలస్వామి, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి నగరంలోని వై జంక్షన్, మయూరి జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, ట్రాన్సిట్ స్టేషన్, వెంకటలక్ష్మి జంక్షన్, ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం నగర ప్రగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ప్రసాదు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, డిఇలు, ఏఈలు పాల్గొన్నారు.

# చట్టం తెలుసుకుంటేనే హక్కులకు రక్షణ'

- ఏపీఆర్ఎస్ బాలికల పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు అవగాహన
- విద్యార్థినులతో మమేకమై న్యాయవ్యవస్థపై చైతన్యం.. ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు.. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచన



**అచ్యుతాపురం- రూరల్ జూలై 14 మనసులో మాట**

"చట్టాలపై అవగాహన ప్రతి విద్యార్థికి అవసరం. హక్కులను తెలుసుకున్నప్పుడే సమాజంలో ధైర్యంగా, బాధ్యతాయుతంగా జీవించగలుగుతారు" అని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు అన్నారు. అచ్చుతాపురంలోని రెసిడెన్షియల్ స్కూల్ (ఏపీఆర్ఎస్) బాలికల పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థినులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ముందుగా పాఠశాలలోని వసతి గృహాలు, తాగునీరు, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఆరోగ్య సౌకర్యాలపై విద్యార్థినులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విని, అవసరమైన సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో న్యాయవ్యవస్థ పనితీరు, లోక్ అదాలత్‌ల ప్రాధాన్యం, రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమానత్వం, సకాలంలో న్యాయం పొందే విధానం, ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అనుసరించాల్సిన ప్రక్రియ గురించి విద్యార్థినులకు సరళమైన భాషలో వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులను న్యాయవ్యవస్థకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి వారి ఆలోచనా సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థినులు అడిగిన సందేహాలకు సన్యాసినాయుడు ఎంతో ఓపికగా, సులభంగా సమాధానాలు చెప్పి వారిలో చట్టాలపై ఆసక్తిని పెంపొందించారు. ఆయన ప్రసంగం విద్యార్థినులకు స్ఫూర్తినిస్తూ, న్యాయ అవగాహనతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలనే ఆత్మవిశ్వాసాన్ని నింపింది. "కలలు కనండి... వాటిని నిజం చేసుకునేందుకు కష్టపడండి. విద్యతో పాటు విలువలు, చట్టాలపై అవగాహన ఉంటేనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారు" అని ఆయన విద్యార్థినులకు సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి విద్యార్థినులతో కలిసిమెలిసి మాట్లాడిన తీరు, ప్రతి ప్రశ్నకు ఓర్పుతో సమాధానం ఇచ్చిన విధానం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. న్యాయ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన చూపుతున్న చొరవ ప్రశంసనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

# మానవ అక్రమ రవాణా నిర్మూలన మనందరి బాధ్యత



**యలమంచిలి టౌన్, జూలై 14, మనసులో మాట,**

సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే మనుషుల అక్రమ రవాణాను సమూలంగా నివారించవచ్చని వెలుగు పథకం సహాయ నిర్వాహకురాలు జి.ఈ. రాణి,ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ శిక్షణ సమన్వయకర్త అంబర్ సింగ్ పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం గ్రామ సమాఖ్య సహాయకులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉద్యోగాలు, సినిమాల్లో అవకాశాల పేరుతో మాయమాటలు చెప్పి మహిళలను అక్రమ రవాణా చేస్తున్నారని, దీనిపై గ్రామ స్థాయి నుండి ప్రజలను, విద్యార్థులను అప్రమత్తం చేయాలని రాణి సూచించారు. అంతర్జాల వినియోగం పెరగడంతో అక్రమ రవాణా ఎక్కువైందని, తమ సంస్థ ద్వారా ఇప్పటి వరకు ముప్పై మూడు వేల మందికి పైగా బాధితులను కాపాడామని అంబర్ సింగ్ తెలిపారు. ఈ శిక్షణలో బాలల రక్షణ, అనైతిక రవాణా నిరోధక చట్టాలతో పాటు ఉచిత సహాయ సేవలైన 1098, 100, 181, 1930 తదితర వివరాలను సిబ్బందికి వివరించారు. శిక్షణ పొందిన సిబ్బంది తమ గ్రామాలకు వెళ్లి స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించాలని, పాఠశాలల్లో విద్యార్థుల నిఘా బృందాలను ఏర్పాటు చేసి నేరాలను అరికట్టాలని అధికారులు ఆదేశించారు.

# బదిలీ అయిన ఉబర్ సర్వేయర్ కు ఘనసత్కారం

**ఎస్. రాయవరం, జూలై 14, (మనసులో మాట):**



ఎస్.రాయవరం మండల సర్వేయర్ గా పనిచేస్తూ, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ గా ప్రమోషన్ పైఅనకాపల్లి బదిలీ అయిన ఏ ఎస్ వి ఎన్ మూర్తిని మండల తాహసిల్దార్ కార్యాలయం సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇంచార్జ్ తాహసిల్దార్ ఎం వి ఎస్ నేరజ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది మూర్తిని సాలువతో సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సూరి, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సూకరాజు, సర్వేయర్ల సంఘం అధ్యక్షులు నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

**అరకులోయ, ఎస్సై టీ మల్లేశ్వర రావు:**



అరకులోయ, జూలై 14 (మనసులో మాట): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల భద్రతపై మంగళవారంఅరకులోయ ఎస్సై టి మల్లేశ్వరరావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూమహిళలు రోడ్డు ప్రమాదాల నివారణకు మరియు గంజాయి నివారణ కోసంవిద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అంతేకాకుండా సైబర్ నేరాలు, పాల్యా వివాహాలు ఆన్లైన్ మోసాల జోలికి పోవద్దని మంచి చదువులు చదువుకొని తల్లితండ్రులకు గ్రామానికి కళాశాలకు మరి ముఖ్యంగా సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత విభేదాలతో రేకులు షెడ్డు ధ్వసం.. బాధితుడు ఆందోళన...

**ఎస్.రాయవరం, జూలై 14, (మనసులో మాట):**





ఎస్ రాయవరం మండలం జంగులూరు గ్రామంలో తన సొంత స్థలంలో నిర్మించుకున్న రేకుల షెడ్డు స్థానిక టిడిపి నాయకుడు,మాజీ సర్పంచ్ భర్త వజ్రపు శంకరరావు అక్రమంగా ధ్వంసం చేశారని గ్రామానికి చెందిన బాధితులు వజ్రపు లక్ష్మీ, వజ్రపు బాబ్జి లు తెలిపారు . నాకు చెందిన సొంత స్థలంలో రేకుల షెడ్డు నిర్మించుకున్నానని, టిడిపి నేత శంకర్రావు తో తనకు ఉన్న వ్యక్తిగత విభేదాలు కారణంగా అక్రమంగా తన షెడ్డును జెసిబి తో ధ్వంసం చేయించారని, తనను తన అనుచరులతో బెదిరించారని ఆయన తెలిపారు. కేవలం రేకుల షెడ్డు నిర్మించుకున్నప్పుడు పంచాయతీ అనుమతి తీసుకోలేదంటూ స్థానిక పంచాయతీ కార్యదర్శిచే రెండు సార్లు నోటీసులు ఇప్పించారని ఆయన అన్నారు. తాను పక్కా నిర్మాణం చేపట్టనందున పంచాయతీ అనుమతి కోరలేదని,కేవలం తనపై ఉన్న వ్యక్తి గత విభేదాల కారణంగా కక్ష సాధింపుతో శంకర్రావు తన షెడ్డుధ్వంసం చేయించారని దీనిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు బాబ్జి విజ్ఞప్తి చేశారు.

# తముటు రోడ్డు వంతెన పనులు ప్రారంభించాలి : గిరిజనుల ఆవేదన







**అనంతగిరి,జూలై 14 మనసులో మాట**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పినకోట గ్రామ పంచాయతీ పరిధిలో తముటు గ్రామానికి మంజూరైన రహదారి, వంతెన (బ్రిడ్జి) నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి, వంతెన లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రహదారి, వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత అధికారులు పనులు ప్రారంభించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల రవాణా, అత్యవసర వైద్య సేవలు, విద్యార్థుల రాకపోకలు అన్నీ ఇదే మార్గంపై ఆధారపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగును దాటడం అత్యంత ప్రమాదకరంగా మారుతుందని, ప్రతి ప్రయాణం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సాగించాల్సిన పరిస్థితి నెలకొంటోందని గ్రామస్తులు వాపోయారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించడం కూడా కష్టసాధ్యంగా మారుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ గోడును ఆలకించి వెంటనే రహదారి, వంతెన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# పెదపాటి కల్యాణికి చిరుసత్కారం చేసిన హోం మినిస్టర్...

- హోం మినిస్టర్ వంగలపూడి అనిత కు కృతజ్ఞతలు తెలిపిన టిడిపి పార్లమెంట్ కమిటీ సెక్రటరీ పెదపాటి కళ్యాణి..

**అనకాపల్లి టౌన్ జూలై 14 మనసులో మాట**

టిడిపి పార్లమెంట్ సెక్రటరీ పెదపాటి కళ్యాణి కి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శాలువ కప్పి చిరు సత్కారం చేశారు. స్థానిక,జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం కు సోమవారం . ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత విచ్చేశారు . ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కార్యాలయం



ఎదుట ఉన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులతో సమావేశమై పార్టీ పటిష్టత కోసం అనంతరం తిరిగి ఆమె ఎస్పీ కార్యాలయానికి వెళ్తున్న పుడు ఆమెకు నాయకులతోపాటు కళ్యాణి కలిశారు. హోం మినిస్టర్ ని సత్కరించబో యారు. ఆ సమయంలో హోమ్ మినిస్టర్ అనిత నేనే మీకు సత్కారం చేయాలంటూ తాను శాలువాతో కళ్యాణిని సత్కరించారు. ఈ సందర్భంగా కళ్యాణి ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు,ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు,మాజీ ఎం ఎల్ ఏ ఏపీ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ,ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళా సురేంద్ర, ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు,డి సిసిఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొణతాల రత్నకుమారి,జిల్లా పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలోచనల అదుపుతో విజయం సైకాలజిస్ట్ రాజేశ్వరరావు సందేశం

**విశాఖపట్నం, మనసులోమాట, జూలై 14:**

ఆలోచనలపై అదుపు సాధించగలిగితే జీవితంలో విజయం సాధ్యమవుతుంద ని ఏయూ సైకాలజీ డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ జి.రాజేశ్వరరావు తెలిపారు. అడ్వాన్స్డ్ సైకాలజికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకా నగర్ లోని బీవీకే కాలేజీలో సైకాలజిస్టుల ప్రశంసా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన రాజేశ్వరరావు మాట్లాడుతూ వ్యక్తిగత జీవితంలోనూ, వృత్తి జీవితం లోనూ క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులు అందించే సూచనలను పాటిస్తే విజయం ఖాయమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రత్న





శేఖర్ మాట్లాడుతూ ప్రశంస దినోత్సవ వేడుకలకు తమ కళాశాలను వేదికగా ఎంచుకోవడం ఆనందదాయకమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు సైకాలజిస్టుల సేవలు ఎంత అవసరమని తెలిపారు. ట్రైనర్ ఎస్ వీ ఆర్ నాయుడు మాట్లాడుతూ ఏపీఏ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు చోట్ల ఒకే రోజు కార్యక్రమాలు నిర్వహించడం వారి టీమ్ వర్క్ కి నిదర్శనమని తెలిపారు. ఏపీఏ ఇండియా జిల్లా కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ జయ మాట్లాడుతూ సమాజం లోని అన్ని వర్గాల వారికి సైకాలజిస్టుల సేవల ఆవశ్యకత పెరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రాజా, కమిటీ సభ్యులు ఇందుమతి, రమణ సిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీ ఛైర్‌పర్సన్ చిన్నశ్రీనుకు మాతృవియోగం... వైయస్ జగన్ సంతాపం...









**విజయనగరం, జూలై 15 (మనసులో మాట జిల్లా ప్రతినిధి):**

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, విజయనగరం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, భీమిలి వైసీపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) కు మాతృవియోగం జరిగింది. ఆయన మాతృమూర్తి మజ్జి కృష్ణవేణి(83) మంగళవారం పరమపదించారు. ఆత్మీయుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ప్రదీప్ నగర్ లోని చిన్నశ్రీను నివాసంలో ఉంచారు. బుధవారం ఉదయం 8 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**మాజీ సీఎం వైఎస్ జగన్ సంతాపం..**

చిన్నశ్రీను మాతృమూర్తి స్వర్గస్తులైన సమాచారం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణవేణమ్మ మరణ వార్త తనను ఎంతో కలచివేసిందని వైఎస్ జగన్ పేర్కొన్నారు. కుటుంబానికి అండగా నిలుస్తూ, విలువలతో కూడిన జీవితం గడిపిన ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ విషాద సమయంలో మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వైయస్ జగన్ ఆకాంక్షించారు. కాగా కృష్ణవేణమ్మ శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కు బంధువు కావడంతో వారి కుటుంబంలో కూడా తీవ్ర విషాదం నెలకొంది.

**ప్రముఖులు పరామర్శ :**

చిన్న శ్రీను మాతృ వియోగం సమాచారం తెలుసుకున్న ఆత్మీయులు, అభిమానులు, కుటుంబ సభ్యులు వేల సంఖ్యలో ప్రదీప్ నగర్ లోని వారి నివాసానికి చేరుకున్నారు. కృష్ణవేణమ్మ భౌతికకాయాన్ని సందర్శించి అశ్రునివాళులర్పించారు. చిన్నశ్రీనుకు తమ ప్రగాఢ సంతాపంను తెలియచేశారు. మాజీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షులు కేకే రాజు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ఇందుకూరి రఘురాజు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యేలు శంభంగి చిన్న అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, ధర్మశ్రీ, చింతలపూడి వెంకట రమణయ్య, అలజంగి జోగారావు, తల్లె భద్రయ్య శోభ హైమావతి, విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్ర, భాగ్యలక్ష్మి, మాజీ జీసీసీ చైర్పర్సన్ శోభా స్వాతి రాణి, నియోజక వర్గ సమన్వయకర్తలు తల్లె రాజేష్, మల్ల అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి, ఉత్తరాంధ్ర జిల్లాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, తదితరులు హాజరై పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. చిన్నశ్రీను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ తీరని లోటును భరించే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# విజయనగరంలో విచ్చలవిడి పశు సంచారం నిషేధం : కమిషనర్ బాలస్వామి





**విజయనగరం టౌన్, జూలై 14 (మనసులో మాట) :**

నగరంలో విచ్చలవిడి పశు సంచారాన్ని నిషేధిస్తున్నట్లు కమిషనర్ బాలస్వామి తెలిపారు. ఆయన ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో కొన్నింటిని పశు యజమానులు వచ్చి విడిపించుకోగా మిగిలినవి గుజ్జంగివలసలో ఉన్న గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ ఇక నుండి నగరంలో విచ్చలవిడి పశు సంచారాన్ని ఉపేక్షించబోమని చెప్పారు. పశు యజమానులకు ఈ విషయమై అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ పశువులను రహదారులపై విడిచిపెడుతున్నారన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన తాము పోలీసు శాఖ సమన్వయంతో పశువులను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలకు, ప్రజా రవాణాకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ అనేక ప్రమాదాలకు పశు సంచారం కారణంగా నిలుస్తోందన్నారు. అందువల్ల రహదారులపై సంచరించే పశువులను స్వాధీనం చేసుకొని అపరాధ రుసుములను వసూలు చేసి పశు యజమానులు అప్పగిస్తున్నామన్నారు.

# రామనాయుడు స్టూడియో సమీపంలో మహిళ ఆత్మహత్యాయత్నం..

**విశాఖపట్నం, జూలై 14, , మనసులోమాట :**



రామనాయుడు స్టూడియో సమీపంలో మహిళ ఆత్మహత్యాయత్నం. సంఘటన స్థానికంగా కలకలం సృష్టిస్తుంది. మధురవాడ, స్థానిక బాలాజీ నగర్ నివాసి జక్క లావణ్య మంగళవారం ఉదయం రామనాయుడు స్టూడియో రహదారి వద్దకు స్కూటీతో చేరుకుంది. స్కూటీపై వచ్చిన ఆమె, వెంట తెచ్చుకున్న రెండు లీటర్ల పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకుంది. దీంతో ఆమె 50 శాతం ఖాళీ గాయాల పాలవ్వడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం కెజిహెచ్ కు తరలించారు. మానసిక సమస్యల వల్లే ఆమె ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మహిళల భద్రతపై అవగాహన ప్రోగ్రామ్

- అరకులోయ, ఎస్సై టీ మల్లేశ్వర రావు

**అరకులోయ, జూలై 14 (మనసులో మాట):**



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల భద్రతపై మంగళవారంఅరకులోయ ఎస్సై టి మల్లేశ్వరరావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూమహిళలు రోడ్డు ప్రమాదాల నివారణకు మరియు గంజాయి నివారణ కోసంవిద్యార్థులతోసమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా సైబర్ నేరాలు, పాల్యా వివాహాలు ఆన్లైన్ మోసాల జోలికి పోవద్దని మంచి చదువులు చదువుకొని తల్లి తండ్రులకు గ్రామానికి కళాశాలకు మరి ముఖ్యంగా సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ఓటర్ వెరిఫికేషన్ పై ఆడారి మంజు రివ్యూ

- బిఎల్వోలతో మాట్లాడుతున్న టిడిపి నేతలు



**మునగపాక, జులై 14, మనసులో మాట**

ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరియు ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరావు మరియు మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతిరావు ఆదేశాల మేరకు వాడ్రా పల్లిసచివాలయం , ఎస్ ఐ ఆర్ ఓటర్ వెరిఫికేషన్ పైన జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు రివ్యూ తీసుకోవడం జరిగింది. ఈ రివ్యూలో బిఎల్వోలు కి ఎస్ ఆర్ ఓటర్ వెరిఫికేషన్ వందకు వంద శాతం ఓటర్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, వాడ్రపల్లి మాజీ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మల్ల వరాహ నర్సింగ్ రావు, మండల తెలుగుదేశం అధ్యక్షుడు మల్ల శేషు, మల్ల జోగారావు బి ఎల్ ఓ లు మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ తరహా ఈఎండిలు లేకుండా టెండర్ వర్కులు అప్పగించాలి..

**విశాఖపట్నం, మనసులోమాట , జులై 14:**



తెలంగాణ తరహా ఈఎండిలు లేకుండా ఏపీలో కూడా టెండర్ వర్కులు అప్పగించాలని జిల్లా సగర సంఘం అధ్యక్షులు చిన్న అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత 45 ఏళ్లుగా టిడిపి, బిజెపి తదితర రాజకీయ పార్టీలో పని చేశామని, ఓటర్ గా వాడుకోవడమే తప్ప, తమను గుర్తించడం లేదని వాపోయారు. కనీసం తమకు నామినేటెడ్ పోస్టులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లారిగానే పనులకు పోయే సగరలు, పనులు లేకపోతే పస్తులతోనే ఉంటున్నారని తెలిపారు. సగరలు రాజకీయంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని వివరించారు. అందుచేతనే ఒడిశాలో అక్కడి ప్రభుత్వం సగరులను ఎస్సీలో చేర్చి ప్రాధాన్యతనిచ్చిందని పేర్కొన్నారు. కాబట్టి సగరులను ఎస్సీ ఎస్టీ జాబితాలో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

## ఎం.డి.ఎం బియ్యం ను పరిశీలించిన సివిల్ సప్లై అధికారుల

**ఎస్ .రాయవరం, జూలై 14, (మనసులో మాట):**



పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకం సంబంధించిన బియ్యం ను జిల్లా పౌరసరఫరాల అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ధర్మవరం అగ్రహారం ,ఎస్. రాయవరం గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ పి.జయంతి ఆధ్వర్యంలో బృందం బియ్యం పరిశీలించి పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు .ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ మాట్లాడుతూ ...రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం నాణ్యమైన పోషకాలతో కూడిన బియ్యం ను పాఠశాలలకు సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. ఇటీవల జూన్ నెలలో విడుదల చేసిన బియ్యం సక్రమంగా ఉన్నాయని,ఏప్రిల్ నెల స్టాక్ లో ఉండిపోయిన బియ్యం లో పెంకు పురుగులు ఉండడం గుర్తించామన్నారు. ఎలమంచిలి రాంబిల్లి ,అచ్చుతాపురం, ఎస్. రాయవరం మండలాలలో పాఠశాలల్లో తనిఖీ చేయగా రెండు పాఠశాలలో కనిపించిన వాటిని మార్చడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి2 కర్రీ శ్రీరామ్మూర్తి, సివిల్ సప్లై అసిస్టెంట్ మేనేజర్లు జి .రమణ, విక్రాంత్ ,నక్కపల్లి సివిల్ సప్లై గోడౌన్ ఇంచార్జ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతగా వ్యవహరించలేదు..

- వెంటనే స్పందించి ఉంటే గల్లంతైన మత్స్యకారులు ప్రాణాలు దక్కేవి.. బాధిత కుటుంబాలను పరామర్శించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి





**విశాఖపట్నం, మనసులోమాట , జులై 14:**

ముఖ్యమంత్రి, సహా మంత్రులు బాధ్యతగా వ్యవహరించ లేదని, వెంటనే అధికారులు స్పందించి ఉంటే గల్లంతైన మత్స్యకారులు ప్రాణాలతో బయటపడేవారని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం విశాఖ చేరుకున్న ఆయన రెల్లి వీధి రోడ్డు, జబ్బార్ తోట జంక్షన్ సమీపానికి వెళ్లి, విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించి వారిని ఓదార్చారు. సంఘటనలో బయటపడిన మత్స్యకారుడు చిన్నాతో గల్లంతైన వారి వివరాలు జగన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ సముద్రంలో బోటు ప్రమాదంలో చిక్కుకున్న చిన్నా, 20 గంటల పాటు మృత్యువుతో పోరాడి ప్రాణాలతో బయటపడ్డారన్నారు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరించిందని విమర్శించారు. జూలై 1న ఏడుగురు మత్స్యకారులు ఫిషింగ్ హార్బర్ నుంచి వేటకు వెళ్లారని, జూలై 4న తీరానికి 10 మైళ్ల దూరంలో బోటు ప్రమాదానికి గురై మునిగిపోయిందన్నారు. ప్రమాదానికి కొద్దిసేపటి ముందు చిన్నా తన మేనల్లుడు గురునాథంకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారని తెలిపారు. ఒక మత్స్యకారుడు బోటుతో పాటు మునిగిపోగా, మిగిలిన ఆరుగురు కలిసి ఈదుతూ ప్రాణాల కోసం పోరాడారన్నారు. రాత్రి 7 గంటలకు ఫిషరీస్ అధికారులకు ప్రమాద సమాచారం ఇచ్చినా స్పందన లేదని ఆరోపించారు. రాత్రి 10:30 గంటలకు కలెక్టర్, మెరైన్ సీఐకి సమాచారం పంపినా తక్షణ చర్యలు తీసుకోలేదని చెప్పారు.

విశాఖలో నేవీ, కోస్ట్ గార్డ్ ఉన్నప్పటికీ వెంటనే స్పందించి ఉంటే ప్రాణాలు కాపాడేవారన్నారు. చైనా బోటు చిన్నాను రక్షించిందని తెలిపారు. త్రిసభ్య కమిటీ నివేదికలో ఉదయం 5 గంటలకు సమాచారం వచ్చిందని పేర్కొనడం తప్పుదారి పట్టించడమేనని విమర్శించారు. హోంమంత్రి వీడియో కాల్‌కే పరిమితమయ్యారని, ఫిషరీస్ మంత్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు బాధితులను కలవలేదని విమర్శించారు.

ప్రభుత్వం ఇచ్చిన రూ.10 లక్షల పరిహారంలో రూ.5 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచేనని ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల మరణ పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. మరణించిన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోటు కోల్పోయిన చిన్నాకు కూడా రూ.1 కోటి పరిహారం, కొత్త బోటు ఇవ్వాలని కోరారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 2023లో ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాదంలో 49 బోట్లకు రూ.7.49 కోట్లు, 400 కలాశీలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం చేశామని తెలిపారు. పాకిస్థాన్‌లో నిర్బంధానికి గురైన 22 మంది, బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న 9 మంది మత్స్యకారులను స్వదేశానికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. వైసీపీ హయాంలో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని ప్రారంభించామన్నారు.

ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్లలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబాన్ని రాజకీయంగా వేధిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, గోరుముద్ద వంటి సంక్షేమ పథకాలు దెబ్బతిన్నాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, చంద్రబాబు "సూపర్ సిక్స్"ను "సూపర్ సెవెన్ మోసాలుగా" మార్చారని విమర్శించారు. మత్స్యకార కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జగన్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, వరుదు కళ్యాణి, మాజీ మంత్రి అమర్నాథ్, తదితర నేతలు పాల్గొన్నారు.

## బీఎల్ఓల ఇంటింటి సర్వే గడువు జూలై 24 వరకు పొడిగింపు...

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్





**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 14, మనసులో మాట:**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సర్వే గడువును జూన్ 15 నుంచి జూలై 24 వరకు పొడిగించామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి, సవరించిన ప్రత్యేక సంక్షిప్త సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను జూలై 24 లోగా పూర్తి చేయాలని, జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణకు అవకాశం ఉంటుందని, సెప్టెంబర్ 28 లోగా వాటి పరిష్కారాన్ని పూర్తి చేసి, అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని వెల్లడించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆముదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఓటర్ల దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియపై కలెక్టర్ తాజా సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,358 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18,97,405 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు అత్యంత వేగంగా 17,30,748 ఓటర్ల దరఖాస్తుల (91.22 శాతం) కంప్యూటరీకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని వెల్లడించారు. ఇందులో భాగంగా బూత్ స్థాయి అధికారుల ద్వారా 17,30,561 (91.21 శాతం) ఓటర్ల వివరాలు క్షేత్రస్థాయిలో ధృవీకరించబడ్డాయని, 7,28,172 మంది ఓటర్లను స్వయం ధృవీకరణ కింద, 9,22,993 మంది ఓటర్లను కుటుంబ సభ్యుల (సంతతి) వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా అనుసంధానం కావాల్సిన 79,396 (4.18 శాతం) మంది ఓటర్ల ప్రక్రియను, మిగిలిన ఇతర సాంకేతిక లోపాలను యుద్ధప్రాతిపదికన సవరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సవరించిన ఈ షెడ్యూల్ సమాచారాన్ని క్షేత్రస్థాయి వరకు విస్తృతంగా ప్రచారం చేయాలని, రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు. తప్పులు ఉంటే సరిదిద్దుకునేందుకు పొడిగించిన సమయం మంచి అవకాశమని కలెక్టర్ అన్నారు.

# కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాల కోసం జులై 30న చలో కలెక్టరేట్

**విశాఖపట్నం, మనసులోమాట , జులై 14:**

కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు తక్కువ లేకుండా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్ ఈఎస్ఐ సెలవులు వంటి కార్మిక చట్టాలు అమలు చేయాలని, కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలనే డిమాండ్లతో ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీస్ ల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు జరగనున్నట్టు సీఐటీయూ నేతలు తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను మంగళవారం జగదాంబ జంక్షన్, సిఐటియూ కార్యాలయంలో ఆవిష్కరించిన అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బి జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఐదు సంవత్సరాలకి ఒకసారి కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవోలను సవరిస్తుందన్నారు. కాని రాష్ట్రంలో 2007 నుండి కనీస వేతనాల జీవోలను సవరించలేదని,



దీనివలన షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంక్స్, హాస్పిటల్స్, విద్యా సంస్థలు, చిన్న పరిశ్రమలు 8 వేల నుండి 12 వేల రూపాయలను మాత్రమే డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులకు చెల్లిస్తున్నారని వివరించారు. ఈ 20 ఏళ్ల కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు పిల్లల స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు రవాణా చార్జీలు విపరీతంగా పెరిగాయన్నారు. అయినా కార్మికుల జీతాలు మాత్రం పెరగలేదన్నారు. ఎనిమిది గంటల పని దినం సక్రమంగా ఎక్కడ అమలు కావడం లేదని కార్మికులు రోజుకు కనీసం 12 గంటల పైబడి పని చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. అత్యధిక మందికి పిఎఫ్ ఈఎస్ఐ వారాంతపు సెలవులు వంటి కనీస కార్మిక చట్టాలు కూడా అమలు కావడం లేదన్నారు. షాపింగ్ మాల్స్ లో ఖాళీ సమయంలో స్టూల్స్ వేసి కార్మికులు కూర్చోవచ్చని రాష్ట్ర హైకోర్టులు తీర్పు ఇచ్చినా, అవి ఎక్కడ అమలు కావడం లేదన్నారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో ప్రస్తుతం కార్మికులకు ఇస్తున్న జీతం పై 20 శాతం, కర్ణాటకలో 60 శాతం పెంపుదల చేశారన్నారు. ఇక్కడ కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ జూలై 30న జిల్లా కలెక్టర్ కి సామూహిక వినతి పత్రం అందజేయమన్నామని, కాబట్టి చలో కలెక్టరేట్ కు కార్మికుల పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం సుబ్బారావు, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి వెంకట్రావు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యూనియన్ నాయకులు వై రాజు, హెచ్పీసీఎల్ షిప్యార్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి పైడ్రాజు, కే పెంటారావు పాల్గొన్నారు.

## అనుమతులు లేని అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం : కమిషనర్ బాలస్వామి

**విజయనగరం, జులై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

నగరపరిధిలో అనుమతులు లేని అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ బాలస్వామి స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రణాళిక అధికారులు, సిబ్బంది స్థానిక ఎన్.సి.ఎస్ థియేటర్ ఎదురుగా పెద్ద చెరువుకు ఆనుకుని చేపట్టిన అక్రమ నిర్మాణాలను, తాత్కాలిక ఏర్పాట్లను మంగళవారం కూల్చివేశారు. జెసిబిల సహాయంతో అనుమతి లేని కట్టడాలను తొలగించి వేయడంతో పాటు తాత్కాలిక షెడ్డులను కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిష





నర్ బాలస్వామి మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణ చర్యలలో భాగంగా ప్రతీ నిర్మాణానికి పట్టణ ప్రణాళిక అధికారుల అనుమతులు తప్పనిసరి అని అన్నారు. అలా కాకుండా అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే తక్షణమే అట్టి నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. అక్రమ కట్టడాలు నిర్మించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఫుట్ పాత్ లు, కాలువలపై కూడా ఎటువంటి నిర్మాణాలు, తాత్కాలికి ఏర్పాట్లు చేపట్టరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టి పి ఓ అప్పలరాజు, టిపిఎస్ అనిత, ప్రణాళిక సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరంలో 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం







**గంట్యాడ, జులై 14 (మనసులో మాట):**

అవయవ దాత గండి పల్లవి జయంతోత్సవాలలో భాగంగా మంగళవారం గంట్యాడలో మెగా రక్తదాన శిబిరం ఎంపీడీవో ఆర్ వి రమణమూర్తి పర్యవేక్షణలో జరిగింది. 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎంపీడీవో ఆర్ వి రమణ మూర్తి ప్రారంభించారు. సేకరించిన రక్తాన్ని అవసరమైన రోగులకు వినియోగించేందుకు విజయనగరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ కు తరలించారు. మెగా రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన దాతలకు గండి పల్లవి తల్లిదండ్రులు గండి వెంకటరమణ, దేవి కృతజ్ఞతలు తెలిపారు. గంట్యాడ తహసీల్దార్ సత్యనారాయణమూర్తి మొట్టమొదటి రక్తదాతగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటిచెప్పారు. అలాగే మండలంలోని సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామ పంచాయతీల నుంచి స్వచ్ఛందంగా వచ్చిన ప్రజలు పాల్గొని రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.పీ.డి.ఓ శ్రీ ఆర్.వి. రమణమూర్తి, తహసీల్దార్ శ్రీ సత్యనారాయణమూర్తి, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీ అబ్దుల్ రఫ్, జనవిజ్ఞాన వేదిక పూర్వ అధ్యక్షులు శ్రీ రాజగోపాల్, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం కమిటీ కన్వీనర్ శ్రీ బి. రామభద్ర రాజు తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.ఈ సందర్భంగా గంట్యాడ ఎంపీడీవో ఆర్.వి రమణ మూర్తి మాట్లాడుతూ, సమాజంలో అత్యవసర పరిస్థితుల్లో రక్త కొరతను నివారించేందుకు ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. అనంతరం రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన దాతలు అందరికీ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది....

**ఎస్. రాయవరం, జూలై 14, (మనసులో మాట):**



మండలంలోని పెట్టుగోళ్లపల్లి , దార్లపూడి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయశాఖ అధ్వర్యంలో నిర్వహించారు. వరి నారు మడి లను పరిశీలించారు.వరి పంటలో నారు మడి యాజమాన్యం గురించి వివరించారు. విత్తిన 10 రోజుల తర్వాత, నారులో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను లేదా లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోర్‌పైరిఫాస్ 2.0 మి.లీ కలిపి పిచికారీ చేయాలన్నారు.విత్తిన 10 రోజుల తర్వాత మరియు విత్తిన 17 రోజుల తర్వాత లేదా నాట్లు వేయడానికి 7 రోజుల ముందు, నారులో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను తక్కువ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. జింక్ లోపాన్ని పర్యవేక్షించాలని, లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలనితెలిపారు. కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు పొందవలసినదిగా తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సౌజన్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది సుగంధి, రాకేష్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నేడు టీడీపీ మండల పార్టీ సమావేశం :కోళ్ల వెంకట రమణ

**శృంగవరపుకోట, జూలై 14: (మనుసులో మాట)**



కొత్తవలస మండల టిడిపి అధ్యక్షుడు కోళ్ళ వెంకటరమణ(శ్రీను) అధ్యక్షతన కొత్తవలస నుండి విశాఖపట్నం వెళ్ళే రహదారి ప్రక్కన దేశపాత్రునిపాలెం జంక్షన్ దగ్గరలో ఉన్న సహస్ర ఫంక్షన్ హాల్ లో ఉదయం గం 10.00 లకు జరుగును అని,మండల టిడిపి సమావేశం నకు మండల పరిధిలోని క్లస్టర్ ఇంచార్జిలు యూనిట్ ఇంచార్జ్ లు బూత్ కమిటీ కన్వీనర్లు గ్రామ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్టీలో వివిధ విభాగాల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మిక్కిలి వినయపూర్వకంగా కోరుచున్నాను.

## కోటబొమ్మాళి ఇంచార్జ్ ఎం.పీ.డీ.వో గా "కిల్లారి"


**టెక్కలి, జులై 14 (మనసులో మాట) :**



కోటబొమ్మాళి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎఫ్.ఎ.సి) కార్యాలయ ఏ.వో కిల్లారి నారాయణరావు తాజాగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కుప్పిలి ఫణీంద్ర కుమార్ పార్వతీపురం డి. డి. ఓ గా పదోన్నతి పై వెళ్లారు. ఫణీంద్ర కుమార్ నుంచి నారాయణరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫణీంద్ర కుమార్ కు అందించిన సహాయ సహకారాలే తనకు కూడా కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు అందించాలని, తద్వారా మండల అభివృద్ధికి దోహదపడాలని నారాయణరావు కోరారు.

## పోలీస్ కమిషనరేట్ పీజీఆర్ఎస్ కు 125 ఫిర్యాదులు

**విశాఖపట్నం, జూలై 14, మనసులోమాట:**



నగర ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు వేగంగా పరిష్కారం చూపే లక్ష్యంతో జరిగిన పి జి ఆర్ ఎస్ కు సోమవారం సాయంత్రం వరకు 125 ఫిర్యాదులు అందాయి. పోలీసు కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. నగరంలోని అన్ని సబ్‌డివిజన్ల ఏసీపీలు, సిఐలు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొనగా ఫిర్యాదులపై సిపి సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారులు సమర్పించిన వినతిపత్రాలను ఒక్కొక్కటిగా పరిశీలించిన పోలీసు కమిషనర్, బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించి, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా విచారించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు న్యాయం జరిగేలా ఆలస్యం లేకుండా ఫిర్యాదులను పరిష్కరించాలని, ప్రతి కేసులో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ వారం పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య వివాదాలు, భూ తగాదాలు, మోసాలకు సంబంధించిన కేసులు, అలాగే సివిల్ వివాదాలకు సంబంధించిన అంశాలే అధికంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు నేరుగా పోలీసు కమిషనర్‌ను కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్న ఈ వేదికకు స్పందన పెరుగుతోందని, ఫిర్యాదుల పరిష్కారానికి పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## కౌలు రైతులకు ఎరువుల కొరత రానివ్వద్దు



- **జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**

**శ్రీకాకుళం/సరుబుజ్జిలి, జిల్లా ప్రతినిధి, జూలై 14, మనసులో మాట.:**

జిల్లాలో సాగు పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో రైతులకు ఎరువుల కొరత రానివ్వబోమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. మంగళవారం సరుబుజ్జిలి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. మండలంలోని పాలవలస రైతు సేవా కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, కొత్తకోటలోని ఎరువుల గోడౌన్, సరుబుజ్జిలిలోని 'మన గ్రోమోర్' సెంటర్లతో పాటు మతలబుపేట గ్రామాల్లో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘాల్లో నిల్వ ఉన్న యూరియా, డీఏపీ తదితర ఎరువుల రికార్డులను, స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎరువుల కొనుగోలుకు వచ్చిన స్థానిక రైతులతో జేసీ నేరుగా మాట్లాడి ఎరువుల లభ్యత, పంపిణీ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం పంపిణీ కేంద్రాల సిబ్బందితో మాట్లాడుతూ.. సబ్సిడీ ఎరువుల విక్రయాల కోసం ఉపయోగిస్తున్న 'ఏపీ ఏఐఎంఎస్ 2.0', 'ఐఎఫ్ఎంఎస్' మొబైల్ యాప్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ యాప్‌ల నిర్వహణలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులు, సర్వర్ సమస్యలపై సిబ్బందిని అడిగి వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ఇందుకోసం సాగుదారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ డేటాబేస్‌లో అప్‌డేట్ చేయాలని, ఈపంట నమోదు ఆధారంగా పారదర్శకంగా పంపిణీ సాగాలని జేసీ ఆదేశించారు. ఎరువుల విక్రయాల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, నిర్దేశిత నిబంధనల ప్రకారమే పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ వెంట మండల డెప్యూటీ తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, స్థానిక రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కుల ఉల్లంఘనపై కఠిన చర్యలు

- **జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**
- **కల్తీలు, నకిలీ వస్తువుల విక్రయాలపై తనిఖీలు ముమ్మరం చేయాలి**

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జూలై 14, మనసులో మాట:**



వినియోగదారుల హక్కుల పరిరక్షణకు, నకిలీలు, కల్తీల నియంత్రణకు జిల్లాలో అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా వినియోగదారుల రక్షణ మండలి (డిసిపిసి) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించగా, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ, ఆహార భద్రతా విభాగాలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వినియోగదారులను తప్పుదోవ పట్టించే మోసపూరిత ప్రకటనలపై, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు వస్తువులు విక్రయించే వ్యాపారులపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా హోటళ్లు, మాల్స్, సినిమా థియేటర్లలో అధిక ధరలకు విక్రయాలు జరిపితే కఠిన జరిమానాలు విధించాలన్నారు. అలాగే గడువు తేదీ దాటిన ఆహార పదార్థాల విక్రయాలపై ఉక్కు పాదం మోపాలని, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గడిచిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై, అమలు చేసిన అంశాలపై చర్చించారు. ఆహార పదార్థాల కల్తీని అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, ఆహార భద్రతా అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 పై గ్రామీణ ప్రాంత ప్రజలకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని, పెట్రోల్ బంకులు, కిరాణా దుకాణాలలో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి కొలతల్లో మోసాలు జరగకుండా చూడాలని, కేసుల వివరాలను సభ్యులకి చేరవేయాలని అన్నారు. జిల్లా సరఫరాల అధికారి సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వినియోగదారుల సేవా సంస్థల సమాఖ్య శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బగాది రామమోహనరావు, శ్రీకాకుళం కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ అధ్యక్షుడు బమ్మిడి నరేంద్ర కుమార్, శ్రీకాకుళం ఆసరా అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంజి ఆర్. ఎజ్రా, నందిగాం మండల కన్స్యూమర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లఖినాన వెంకటాచలం, పలాస మండల కన్స్యూమర్ వెల్ఫేర్ ప్రోగ్రామ్స్ సెక్రటరీ ఉప్పాడ రమేష్, హిరమండలం మండల కన్స్యూమర్ కౌన్సిల్ ప్రతినిధి అందవరపు వెంకట సురేష్, ఆమదాలవలస మండల ప్రగతి యువజన సేవా సంఘం తాళాబత్తుల ధనుంజయరావు, పలాస మండల జిల్లా గ్రామీణ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు డి. ఉమామహేశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల కన్స్యూమర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు కంసు నిర్మల, పలాస మండల కన్స్యూమర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డి. జనార్ధనరావు, డిప్యూటీ కమిషనర్ ఆర్టీవో పి.వి. గంగాధర్, వైద్య ఆరోగ్య శాఖ పీఓ ఆర్‌బీఎస్‌కే ఎన్‌సీడీ కె. సూర్యప్రకాష్ రావు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి. చిన్నమ్మడు, సహాయ ఆహార నియంత్రణ అధికారి ఈ.ఎల్. నారాయణ, ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సిహెచ్.ఎ. నారాయణ, గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈఈ పి. లలితా కుమారి, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.ఎన్.వి. ప్రసాద్, సీనియర్ న్యాయవాది అన్నెపు భువనేశ్వర్ హాజరయ్యారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జీవన ఎరువుల వినియోగంపై అవగాహన

**హుకుంపేట జూలై 14 మనసులో మాట**



మండలంలోని గూడా పంచాయతీలో మంగళవారం "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యేరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. ఉమామహేశ్వరరావు వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. జీవన ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు, నేల సారాన్ని పెంపొందించడంలో వాటి పాత్రను రైతులకు వివరించారు. అలాగే వరి నాటే సరైన విధానం, పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. సుధాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ జ్ఞానప్రకాశ్, వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు. రైతులు అడిగిన సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చి పంట నిర్వహణపై సూచనలు అందించారు.

# అడ్డు అదుపు లేకుండా బుడ్డిగ కొండమ్మ భూ కబ్జాలు...

- **అక్రమ నిర్మాణదారులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని: ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్**
- **రెవిన్యూ శాఖ ప్రోత్సాహంతోనే అక్రమ నిర్మాణాలు -ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్**





**హుకుంపేట, జూలై 14, మనసులో మాట**

హుకుంపేట మండలంలో రెవెన్యూ అధికారుల అండదండలతోనే గిరిజనేతరులు కాకినాడ విజయ మొదమాంబ అలియాస్ బుడ్డిగ కొండమ్మ భూ ఆక్రమణలకు పాల్పడుతోందని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి టి. కృష్ణారావు, నాయకులు వి. లక్ష్మణరావు, పి. లింగమూర్తి ఆరోపించారు. వారు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, బుడ్డిగ కొండమ్మ ఇప్పటికే అనేక ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టి, విచ్చలవిడిగా క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ కార్యాలయానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 75 ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసి ఆక్రమణకు పాల్పడుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. స్వయం ఉపాధి కోసం గిరిజనులకు చిన్న స్థలం ఇవ్వడానికి అనేక కారణాలు చెప్పే అధికారులు, గిరిజనేతరులకు ఏ ప్రాతిపదికన ప్రభుత్వ భూములను బహూకరించి రిజిస్ట్రేషన్లు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల మౌనం అనుమానాలకు తావిస్తోందని, అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా స్థాయి అధికారులు సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన రెవెన్యూ అధికారులతోపాటు అక్రమ నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# జగన్ రెడ్డి విలువలతో కూడిన మాటలు మాట్లాడాలి

- కాశీబుగ్గ ఘటనలో మంత్రి అప్పలరాజుని వెనకేసుకురావడం సిగ్గుచేటు
- నేరాలను, ప్రమాదాలను ప్రోత్సహించే విధంగా జగన్ రెడ్డి మాటలు
- మత్స్యకారులకు తెలుగుదేశం పార్టీ అండదండలు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, జులై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**



మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విలువలతో కూడిన మాటలు మాట్లాడాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ బోటు గల్లంతులో అదృశ్యమైన వారి కుటుంబాలను పరామర్శకు వచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయటం జగన్ రెడ్డికే చెల్లుబాటు అయిందన్నారు. జగన్ రెడ్డికి అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారులు, వారి సమస్యలు ఏనాడు గుర్తుకు రాలేదని... కేవలం రాజకీయ లబ్ధికోసమే జగన్‌కు ఇప్పుడు మత్స్యకారులు గుర్తుకు రావడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. అబద్ధాలు ఆడడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని, బోటు గల్లంతైన విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు నాలుగు రోజులు పాటు హెలికాప్టర్లు, మెరైన్ బోట్లతో సిబ్బంది విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రమాదంలో సురక్షితంగా ఉన్న చిన్నాను వెనువెంటనే కాపాడి వైద్య సేవలందించామని, చిన్నా సూచన మేరకు బోటు గల్లంతైన ప్రాంతం తెలుసుకుని మిగిలిన వారికోసం జల్లెడ పట్టినా వారి ఆచూకి లభించకపోవడం దురదృష్టకరమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం మాటల రూపంలో కాకుండా చేతలతో బాధిత కుటుంబాలకు తక్షణమే రు.10లక్షలు అందించిందని.. అదే గత వైసీపీ ప్రభుత్వంలో ఎందరో బాధితులకు పరిహారం ప్రకటించి ఎగ్గొట్టిన ఘనత కూడా జగన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం తరపున ఇద్దరు మంత్రులు బాధిత కుటుంబాలను పరామర్శించడంతోపాటు ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలు వారికి ఆసరాగా నిలిచిన విషయాన్ని కూడా తప్పుదోవ పట్టిస్తూ విమర్శలు చేయటం బాధాకరమన్నారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉందన్నారు. కాశీబుగ్గ ప్రమాద సంఘటన సైతం రాజకీయం చేయడం జగన్‌కు సిగ్గుమాలిన చర్య అని.. అక్కడ ప్రమాదం యాదృచ్ఛికమే అయినప్పటికీ ప్రమాదాన్ని తారుమారు చేసి మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు తన కుమారుడు అరవ్ కోసం మరో అమాయకుడిని బలి చేయడం సరికాదని మంత్రి పేర్కొన్నారు. అలాగే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని మాజీ మంత్రి కేసు తారుమారు చేయడాన్ని స్థానిక ప్రజలందరూ గుర్తించడం జరిగిందన్నారు. జగన్ రెడ్డి మాటలు ప్రమాదాలను, నేరాలను ప్రోత్సహించే విధంగా ఉన్నాయన్నారు. ఒక బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధి అటువంటి మాటలు మాట్లాడటం సరికాదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హితవు పలికారు.

# 23 మంది రైతులకు రూ.14 లక్షల పంట రుణాల పంపిణీ

**హుకుంపేట, జులై 14: మనసులో మాట**



హుకుంపేట మండలంలోని 23 మంది రైతులకు మొత్తం రూ.14 లక్షల పంట రుణాలను అందజేసినట్లు పీఏసీఎస్ ఛైర్మన్ తాంగుల మోహన్, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, పీఏసీఎస్ కార్యదర్శి అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు సకాలంలో పంట రుణాలను వినియోగించి ఖరీఫ్ సాగును విజయవంతంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం సహకార బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రైతులకు పంట రుణాలు అందిస్తున్నదని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ అవసరాల కోసం మాత్రమే రుణాలను వినియోగించి, సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. సహకార సంఘాలు రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని, అర్హులైన ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, సహకార సంఘం ప్రతినిధులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# పెట్టుబడి పేరుతో రూ.22 లక్షల మోసం దొరబాబుపై చీటింగ్ కేసు నమోదు

**నర్సీపట్నం: జులై 14 (మనసులో మాట)**

పెట్టుబడి పేరుతో రూ.22 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని, డబ్బులు అడిగినందుకు బెదిరింపులకు పాల్పడ్డారని వచ్చిన ఫిర్యాదు మేరకు నర్సీపట్నంకు చెందిన జనసేన నాయకుడు ఎస్ఎస్‌జీ దొరబాబుపై నర్సీపట్నం టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.బేరా కామాక్షి కల్పన డీఎస్పీ పి. శ్రీనివాస్‌కు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. తన భర్త బేరా శేషు 2011లో వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాలలో భాగస్వామిగా మొదట రూ.12 లక్షలు, అనంతరం మరో రూ.10 లక్షలు పెట్టుబడిగా ఇచ్చారని, మొత్తం రూ.22 లక్షలు పెట్టుబడి పెట్టినప్పటికీ భర్త మరణించిన తర్వాత ఇప్పటివరకు ఆ డబ్బులు తమ కుటుంబానికి తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. డబ్బులు కోరిన ప్రతిసారీ దొరబాబు ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ, అవమానకరంగా మాట్లాడటంతో పాటు, "మళ్లీ డబ్బులు అడిగితే చంపేస్తాం.. ఎక్కడికైనా వెళ్లి చెప్పుకో.. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు అంటూ బెదిరించారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ బెదిరింపుల కారణంగా తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, ఒక రోజు రాత్రి సమయంలో తనను బైక్‌తో ఢీకొట్టేందుకు ప్రయత్నించారని, అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నానని తెలిపారు. ఈ ఘటన తర్వాత తమ కుటుంబ భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. దొరబాబు ప్రస్తుతం జనసేన పార్టీ నాయకుడిగా ఉన్నప్పటికీ, చట్టం అందరికీ సమానమనే నమ్మకంతో ఫిర్యాదు చేస్తున్నానని కామాక్షి కల్పన తెలిపారు. తనపై బెదిరింపులు, దాడి యత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, తనకు రావాల్సిన రూ.22 లక్షల పెట్టుబడి మొత్తాన్ని ఇప్పించి, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన నర్సీపట్నం పోలీసులు దొరబాబుపై చీటింగ్‌తో పాటు ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# పంటల బీమా ను వినియోగించుకోవాలి : ఏవో శ్యాం కుమార్

**గంట్యాడ, జులై 14 (మనసులో మాట):.**



పంటల బీమా పథకాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని, మంగళవారం గంట్యాడ మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో గంట్యాడ మండల వ్యవసాయ అధికారి బి శ్యాం కుమార్ రైతులకు సూచించారు. గంట్యాడ మండలంలోని రామవరం, నరవ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గంట్యాడ మండల వ్యవసాయ అధికారి బి శ్యాం కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత రైతు సేవ కేంద్రాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై ఏవో శ్యాం కుమార్ అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. పంటల బీమా పథకానికి సంబంధించి రైతులు ఆగస్టు 15వ తేదీలోగా భీమా ప్రీమియం చెల్లించి పంటల బీమా లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో శ్యామ్ కుమార్ సూచించారు. సూచించారు.

# తిమ్మాపురం లో మంచినీటికి కటకట

**ఎస్.రాయవరం, జులై 14, (మనసులో మాట ):**



ఎస్ రాయవరం మండలం తిమ్మాపురం మేజర్ పంచాయతీలో గత వారం రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సాంకేతిక లోపం కారణంగా తిమ్మాపురం గ్రామంలోని మంచినీటి ట్యాంక్ లకు నీటిసరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఐదు రోజులకు ఒకసారి మాత్రమేసరఫరా చేసే మంచినీరు గత 10 రోజులుగా నిలిచిపోవడంతో గ్రామస్తులు బావులు, వ్యవసాయ మోటార్లపై ఆధారపడవలసి ఉంటుంది. ఆర్వో ప్లాంట్ ల వద్ద మంచి నీటి కోసం వేచి ఉండక తప్పలేదు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు. మంచినీటి సరఫరాను పునఃద్ధరించేందుకు సాంకేతిక లోపాలను సరిచేయాలని తిమ్మాపురం గ్రామస్తులు కోరుతున్నారు.

# టెక్కలి డివిజన్లో 4630 ఎకరాల్లో పశు గ్రాసం పండించడమే లక్ష్యం

- పశుగ్రాస వారోత్సవాలను సందర్శించిన ఉప సంచాలకులు

**టెక్కలి, జులై 14 (మనసులో మాట) :**



202627 సంవత్సరానికి సంబంధించి టెక్కలి డివిజన్ లోని 14 మండలాల్లో 2027 మార్చికి 4630 ఎకరాలలో పశుగ్రాసాలను వేయించే లక్ష్యంతో వెళ్తున్నామని పశుసంవర్ధక శాఖ టెక్కలి ఉపసంచాలకులు డాక్టర్ చందక నరసింహులు అన్నారు. పశుగ్రాస వారోత్సవాలు ఆఖరి రోజు అయిన సందర్భంగా కోటబొమ్మాళి మండలం మెండపేట గ్రామంలో గల పశుగ్రాస క్షేత్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఇందులో గడచిన జూన్ నెల వరకు 1109 ఎకరాలలో పశుగ్రాసాలను వేయాల్సి ఉండగా.. 1159 ఎకరాలలో పశుగ్రాసాలను వేయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమమునకు నిమ్మాడ పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్, టెక్కలి సహాయ సంచాలకులు డా.బి. వెంకటరమణ , కొల్లిపాడు పశువైద్యాధికారి డా.గౌతమ్ ,మెంద మాధవ, రెడ్డి నవ్య మొదలగు పాడి రైతులు పాల్గొన్నారు.

# నేటి నుంచి వారాహి మాతా నవరాత్రి ఉత్సవాలు



**గాజువాక (మనసులోమాట )జులై 14**

శ్రీ వెంకటేశ్వర వైదిక సంస్థాపనమ్ ఆధ్వర్యంలో వడ్లపూడి ఈసేవ మైదానంలో బుధవారం నుంచి వారాహి అమ్మవారి నవరాత్రి ప్రయుక్త అంబికా పంచాయతన యాగ మహోత్సవాలు నిర్వహించనున్నారు.ఈ మేరకు యాగ నిర్వాహకులు,ఆగమ వైదిక స్మార్త పండితులు జె. వెంకట హరీష్ శర్మ,బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు,వార్డు మాజీ కార్పొరేటర్ బొండా జగన్ లు ఏర్పాట్లను పరిశీలించారు.24 వ తేదీ వరకు ఈ వేడుకలు జరుగుతాయని,లోక కళ్యాణార్థం చేపట్టే ఈ మహోత్సవంలో భక్తులంతా పాల్గొని వారాహి మాత అనుగ్రహాన్ని పొందాలని కోరారు.తొమ్మిది రోజులూ సామూహిక కుంకుమ పూజలు,హోమం ,కళ్యాణం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.కార్యక్రమంలో కృష్ణా రెడ్డి,రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఏటికొప్పాకలో 'పొలం పిలుస్తోంది

**యలమంచిలి టౌన్ జూలై 14,**
**మనసులో మాట,**



మండలంలోని ఏటికొప్పాక, బయ్యవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మోహనరావు మాట్లాడుతూ..రైతు సోదరులందరూ ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఎక్కువ పంటకాల పరిమితి రకాలైనటువంటి పంటలు వేసుకోవాలని సూచించారు. వాటికీ అవసరమైన విత్తనాలు, అన్ని రకాల వరి విత్తనములు వ్యవసాయ శాఖ, రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువుల విషయంలో ముఖ్యంగా యూరియా కొరత లేదన్నారు. అన్ని రైతు సేవా కేంద్రాలతో పాటుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లక్కవరం, డీలర్ల వద్ద 124 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, రైతు సోదరులు ఆధార్ నెంబర్ ను ఉపయోగించి ఏపీ ఎఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువులు తీసుకోగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు సూర్యారావు, పెంటయ్య, నానాజీ, ఎపి సిఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ సహాయకులు మధు, కుమార్ పాల్గొన్నారు.

# జైల్లో ఖైదీల బెయిల్ ప్రభుత్వ వకీలు





**ఎలమంచిలి టౌన్ , జూలై 14,**
**మనసులో మాట,**

సబ్ జైల్లో ఉన్న ఖైదీలకు బెయిల్ అవసరమైనప్పుడు ప్రభుత్వ వక్రీలను ఏర్పాటు చేస్తామని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు అన్నారు. సోమవారం నాడు ఎలమంచిలి సబ్ జైల్ ను సందర్శించి ఆయన ముద్దాయిల యొక్క సమస్యలను కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎవరికైనా ఉచిత న్యాయ సహాయము కావాలంటే వారికి ప్రభుత్వ వకీలను కేటాయించి బెయిలు పెట్టిస్తామని చెప్పారు. ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోయిన జైల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా చెప్పండి అని వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో సబ్ జైల్ సూపర్డెంట్ కిరణ్, పానల్ లాయర్స్ పివి రమణ, టి నూకరాజు, బి హరి శంకర్ ,కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు .

# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగింపు....

- వరకు ఇంటింటి సర్వే.. అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురణ..
- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్...

**వి మాడుగుల (మనసులో మాట )జూలై 14**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 సర్ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి విజయ క్రిష్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం జూలై 24 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా జూలై 24లోపు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జరుగుతుందని వెల్లడించారు. అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. అనంతరం వాటి విచారణ, పరిష్కార ప్రక్రియను సెప్టెంబర్ 28 వరకు పూర్తి చేసి, అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం వేగవంతంగా పూర్తి చేయడానికి ఎన్నికల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లినప్పుడు ఓటర్లు పూర్తి సహకారం అందించి అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించాలని కోరారు. కాగా ప్రజలందరూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సవరించిన షెడ్యూల్‌ను గమనించి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు లేదా కొత్త ఓటరు నమోదు కొరకు నిర్దేశిత గడువు లోగా తమ దరఖాస్తులను సమర్పించి ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆదివాసీలకు రక్షణ చట్టం1ఆఫ్70 అమలుచేయాలి: వాబయోగి

**పాలకొండ, జులై 14,మనసులో మాట:**



ఆదివాసీలకు రక్షణ కవచమైన 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులువాబయోగి డిమాండ్ చేశారు. మంగళవారం పాలకొండ లో డాక్టర్ సి.ఎల్.నాయుడు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో వాభయోగి మాట్లాడుతూ, సుప్రీం కోర్టులో 1 ఆఫ్ 70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు వేసిన కేసులో ప్రభుత్వం వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు వెన్నుముక లాంటి 1ఆఫ్ 70 యాక్ట్ ను నిర్వీర్యం చేయరాదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆ సమావేశంలో, మన్యం జిల్లా అధ్యక్షులు బిడ్డిక శ్రీను మాట్లాడుతూ 1/ 70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు సుప్రీంకోర్టులో వేసిన కేసుపై రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆ కేసులో రాష్ట్ర ప్రభుత్వ స్వయంగా ఇంప్లీడ్ పిటిషన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి బిడ్డక శ్రీను డిమాండ్ చేశారు. జీవో నెంబర్3 నిర్వీర్యం చేసినట్టు,1/70 చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలు చేసిన పక్షంలో మరో శ్రీకాకుళం సాయుధ పోరాటానికి సిద్ధమని ఈ ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామని శ్రీను అన్నారు. ఆదివాసీ జేఏసీ కార్యదర్శి బిడ్డక ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ వన్ ఆఫ్ సెవెంటీ యాక్ట్ అమలు చేయాలని లేదంటే గిరిజనులు తీవ్ర స్థాయిలో నష్టపోతారని బ్రతుకు లేకుండా పోతారని అన్నారు

# పర్యావరణ పరిరక్షణతోనే దైవత్వం సాకారం : జిల్లా కలెక్టర్ ప్రభాకర రెడ్డి

- శ్రీ కోటదుర్గ అమ్మవారి ఆలయంలో వినూత్నంగా శ్రీ వనదుర్గ బంతి-చామంతి మహోత్సవం
- భక్తులకు ప్రసాదంగా పూజించిన మొక్కల పంపిణీ
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి





**పాలకొండ,జూలై 14, మనసులో మాట :**

ఆధ్యాత్మికతకు పర్యావరణ పరిరక్షణను జోడిస్తూ శ్రీ కోటదుర్గ అమ్మవారి దేవస్థానంలో "శ్రీ వనదుర్గ (బంతిచామంతి) మహోత్సవం" భక్తుల్లో సామాజిక బాధ్యతతో కూడిన ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించనుందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. మంగళవారం పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణతో కలిసి ఈ మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, వినూత్నంగా జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ ప్రాంగణంలో బంతి, చామంతి తదితర పుష్ప మొక్కల నడుమ అమ్మవారిని "నవదుర్గ" స్వరూపంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రకృతిని ఆరాధించే భారతీయ సంస్కృతిని మరింత బలపరిచే విధంగా ఈ మహోత్సవాన్ని రూపుదిద్దామని పేర్కొన్నారు."పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, చెట్లను, మొక్కలను సంరక్షించడం అంటే భవిష్యత్ తరాలకు జీవనాధారాన్ని అందించడం అన్నారు. ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములైనప్పుడే నిజమైన దైవత్వాన్ని అనుభవించగలమని కలెక్టర్ తెలిపారు.

**ప్రసాదంగా పూజించిన మొక్కల పంపిణీ**

ఈ మహోత్సవంలో ప్రత్యేకతగా అమ్మవారికి పూజించిన బంతి, చామంతి మొక్కలను భక్తులకు తీర్థప్రసాదంగా అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే, ఆలయానికి విచ్చేసే ప్రతి భక్తుడు తమకు సాధ్యమైనంత వరకు ఒక మొక్కను లేదా ఒక నారును తీసుకువచ్చి ఈ మహోత్సవంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి సంరక్షిస్తే పచ్చదనంతో కూడిన సమాజ నిర్మాణానికి తోడ్పడినవారవుతారని అన్నారు. అంతకుముందు అమ్మవారిని కలెక్టర్ దర్శించుకోగా, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అర్చకులు అందించారు. శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ సాధారణంగా బంతి, చామంతి మొక్కలను ఇంటి ముందర వేసుకోవడం ద్వారా అందంతో పాటు దోమలు దరిచేరవన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల ఇరువైపులా మొక్కలు నాటడం ఎంతో అవసరమని వివరించారు. ఇది వాతావరణాన్ని చల్లబరచడానికి, మంచి గాలిని అందించడానికి పర్యావరణాన్ని అందంగా తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.